
BALA CHELIMI

BALA

AUG 2025

AUG



₹40

అగస్టు - 2025

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 34 • సంచిక : 11



AUGUST - 2025

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)


## ప్రచురణలు

బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక

**38 పుస్తకాల ధర రూ.1630 • తగ్గింపు ధర రూ. 1450**

### తెలంగాణ బడి పిల్లల కథలు

10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)

10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు

18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు – ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లల్లో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

–మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88


SCAN & PAY

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055


బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

సంపుటి: Volume: 34 | సంచిక : Issue : 11 | హైదరాబాద్ Hyderabad | ఆగస్టు August | పేజీలు Pages 52 | రూ. ₹. 40











లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు... | మణికొండ వేదకుమార్. | 5 |
| ఆధునిక భారతీయ ఖగోళ శాస్త్ర పితామహుడు ఎం.కె. వైను బప్పు (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| చిత్రం (ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| మేరీకోమ్ | షీరోస్-256 | 9 |
| గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం (అక్షరం) | డా॥ జనపాల శంకరయ్య | 10 |
| నేను అర్జున్ అవుతా! (కథ) | అనురాధ నాదేళ్ల | 11 |
| కలలు నిజం కావాలంటే.. (స్ఫూర్తి) | గోపాలం కె బి | 13 |
| బంగారు మర్రి – 3 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| పిల్ల కోతి నిర్లక్ష్యం (కథ) | బి. విశ్వతేజ | 17 |
| వంగుళ్ళు – దూకుళ్ళు (ఆట).. | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు | 18 |
| నదీ తీరాలు మన నాగరికతకు నిలయాలు (యాత్ర) | దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి | 19 |
| వరుస 11 సంఖ్యల మొత్తం (మాథ్స్ ట్రిక్స్) | అంకెల మామయ్య చంద్రయ్య | 20 |
| సర్వకాల ఉత్సాహం స్వాతంత్ర్య దినోత్సవం (పండుగ) | డా. అమ్మిన శ్రీనివాసరాజు | 21 |
| జామ చెట్టు (చెట్టు – చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 23 |
| నోబెల్ బహుమతి వస్తుందని ముందే ధీమాగా చెప్పిన సి.వి.రామన్ (సైన్స్ వెన్నెల-10) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| పులి కూన గెంతులు (కథ) | తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర | 25 |
| ఆగస్ట్ 15 (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| అట్టాడ చరణ్‌కు ఆసియన్ వేదికపై కాంస్య పతకం గౌరవం (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| దోమ పగ (కథ) | డా. పోతగాని సత్యనారాయణ | 29 |
| వేమన పద్యాలు | | 30 |
| ఇసుక తుఫాను (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| కాకి – పాము కథ | పంచతంత్ర కథ | 32 |
| కొబ్బరి మిఠాయి (పాట) | గంగదేవు యాదయ్య | 32 |
| తొలి సామ్రాట్టులు శాతవాహనులు (చరిత్ర పాఠాలు-6) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 33 |

పొదుపు కథ ........................................................................ తల్లావజల మహేశ్ బాబు ................ 34
దురదృష్టవంతుడి అదృష్టం (కథ) ........................................................ బూర్లె నాగేశ్వరావు ........................ 35
టీచరు - పిల్లలు (కథ) ......................................................................... తల్లెల కీర్తి ................................... 37
చెలిమి క్లబ్ ........................................................................................ బాలచెలిమి ................................ 38
అక్షర భావాలు (కవిత) ......................................................................... గద్వాల సోమన్న ........................... 38
మేఘాలలో విద్యుచ్ఛక్తి .......................................................................... బాల కథా సౌరభం ......................... 39
జబర్ ఫిల్టర్ (సైన్స్) ............................................................................ డాక్టర్ మహీధర నళినీ మోహన్ .......... 40
మోసానికి ప్రతిఫలం (కథ) ...................................................................... పేట యుగంధర్ ........................... 41
నేర్చుకుందామా ........................................................................................................................... 42
కలం-చెలిమి ................................................................................................................................ 42
దేశం - కరెన్సీ (జి.కె.) ........................................................................ బాలచెలిమి డెస్క్ ......................... 43
మారిన శీను (కథ) ............................................................................... గార్లపాటి క్రిష్ణ మనోహర్ ................ 45
ఆవు (జంతువు) ................................................................................... సచిన్ కోత్వాల్ ........................... 46
జెడ్.పి.హెచ్.ఎస్., చిన్న మాదారం, కనగల్లు, నల్లగొండ బాలచెలిమి గ్రంధాలయం.. వల్లపట్ల పద్మ ............................. 47
సమాచారం ......................................................................................... బాలచెలిమి డెస్క్ ......................... 48
పుస్తక పరిచయం .................................................................................. బాలచెలిమి డెస్క్ ......................... 49
దేశసేవకు అంకితమైన ఉద్యమాల ఊపిరి - కొండా లక్ష్మణ్ బాపూజీ (వ్యక్తిత్వం) .... సువేగా ..................................... 50




# చెలిమి లేఖలు

నమస్కారం సార్, మా పాఠశాల విద్యార్థిని కె.సాయి ప్రసన్న రాసిన కథ 'చదువు సంస్కారం' జూలై 2025 బాలచెలిమి బాలల మాస పత్రికలో ప్రచురితమైనది. ఆ సంచికను విద్యార్థినికి ప్రార్థన సమావేశంలో మా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జి.సునీత గారి చేతుల మీదుగా అందించడం జరిగింది. ధన్యవాదాలు.

**- మీసాల సుధాకర్**, జనగామ జిల్లా

రోజు పాఠ్య పుస్తకాలతో కుస్తీపడే మాకు బాల చెలిమి మ్యాగజైన్ ఆటవిడుపు కలిగిస్తుంది. సమయం దొరికినప్పుడల్లా స్నేహితులతో కలిసి బాలచెలిమి పుస్తకాలు చదువుకుంటాను. ఇందులో నాకు బాగా నచ్చింది చెట్టు - చేమ శీర్షిక. ఇందులో నెలకొకటి చొప్పున తీరొక్క చెట్ల గురించి వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసు కుంటున్నం. చెట్ల గురించి చదివి నేను కూడా వేప చెట్లు నాటాను.

**- సంద్రాల రేణుశ్రీ**

9వ తరగతి, ZPHS ఇంగ్లీష్ మీడియం, చిన్న మాదారం.

చాలా బాగుంది బంగారుమర్రి సీరియల్. మొదటి భాగంలోనే మంచి సస్పెన్స్‌లో ఉంచారు. అభినందనలండి పైడి (బంగారు) మర్రి రామకృష్ణ గారు.

**- కె.వి. సూర్యనారాయణ**

బాల చెలిమిలో మీ 'బంగారు మర్రి' సీరియల్‌గా రావడం చాలా సంతోషం. మీకు అభినందనలు.

**- జొన్నలగడ్డ శ్యామల**

*Cover Picture by*
***T. Swamy***

*బొమ్మలు:*
**కూరెళ్ల శ్రీనివాస్**
m : 98495 43728





**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు...

పిల్లలూ.... మీకూ, మీ అమ్మానాన్నలకూ, మీ టీచర్స్‌కూ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఆగస్ట్ 15 మన ప్రజలందరి పండుగ. 200 సంవత్సరాల బ్రిటీష్ వారి వలస పాలన నుండి విముక్తి పొందిన రోజు.

భారతదేశం ప్రకృతి వనరుల రత్నగర్భ – అనేక ముడివనరులతో పాటు, సుగంధ ద్రవ్యాలకు ప్రసిద్ధి. మొదటగా 1497లో పోర్చుగీసుకు చెందిన వాస్కోడిగామా భారతదేశానికి సముద్ర మార్గాన్ని కనుగొన్నాడు. మిరియాలు వంటి సుగంధ ద్రవ్యాల వ్యాపారాన్ని సాగించాడు. తక్కువ రేట్లకు తరలించి అనేక రెట్ల లాభాలు సంపాదించాడు. ఆ తర్వాత డెచ్చి వాళ్ళు ప్రవేశించారు. ఆ తర్వాత వందేళ్ళకు బ్రిటిష్ వారి కన్ను మన దేశంపై పడింది. యూరప్ ప్రజలకు సుగంధ ద్రవ్యాలపై ఎంత ఆసక్తి ఉందో వాటి కొరత కూడా వారికి అంతే ఉంది. అప్పటికి భారతదేశం వివిధ రాజుల పాలనలో అనేక రాజ్యాలుగా వుంది. 1608లో బ్రిటీష్ వాళ్ళు మొగల్ సామ్రాజ్యాన్ని పాలిస్తున్న జహంగీర్ అనుమతితో సూరత్‌లో ప్రవేశించారు. ఈస్టిండియా కంపెనీ ద్వారా 1757 వరకు కేవలం వ్యాపారం చేసారు. మన దేశ ముడిసరుకులను బ్రిటన్ తరలించి వాటితో తయారైన వస్తువులను తెచ్చి మనకే అమ్మేవారు. తరువాత మన ముడిసరుకులతో, మన దేశ ప్రజల శ్రమతో వస్తువులను యిక్కడే తయారు చేసేవారు. తమ పరిశ్రమలకు సెక్యూరిటీ పేరుతో చిన్న చిన్నగా ఆర్మీని, ఆయుధాలను సమకూర్చుకున్నారు. వ్యాపారం చేసిన ఈ సుదీర్ఘ కాలంలో మన దేశంలోని రాజ్యాలను, రాజులను, ప్రజల ఆలోచనలను, అలవాట్లను, బలాలు, బలహీనతలను బాగా అర్థం చేసుకున్నారు. రాజుల మధ్య, రాజ్యాల మధ్య తగాదాలను, యుద్ధాలను ఆసరాగా తీసుకుని సామదాన దండోపాయాలతో ఒక్కో రాజ్యాన్ని ఆక్రమిస్తూ దేశం మొత్తాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. తమ పాలనలో దేశాన్ని కొల్లగొట్టారు. విభజించి పాలించు విధానాన్ని అవలంభించారు.

బానిసత్వం ఏ మనిషీ ఎక్కువ కాలం సహించలేడు. స్వేచ్ఛాకాంక్ష మన ప్రజల్లో బలంగా మొలకెత్తింది. అది జాతీయోద్యమంగా మారింది. సత్యాగ్రహాలు, నిరాహారదీక్షలు, ఉప్పు సత్యాగ్రహాలు, విదేశీ వస్తు బహిష్కరణ, సహాయ నిరాకరణ వంటి వివిధ రూపాల్లో పోరాటాలు జరిగాయి. గాంధీ, నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ తదితరులు ఈ జాతీయోద్యమంలో వేరు వేరు పంథాలను అనుసరించారు. ప్రతి ఇల్లూ ఉద్యమ కేంద్రమయింది.

జాతీయోద్యమంలోని తీవ్ర పరిణామాలను గమనించిన బ్రిటిష్ ప్రభుత్వం 1947 ఆగస్ట్ 14 అర్ధరాత్రి మనకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది. 1947 ఆగస్ట్ 15 నుంచి మన దేశం మన స్వరాజ్యమైంది. పింగళి వెంకయ్య రూపకల్పనలో మువ్వన్నెల జెండా మన జాతీయ పతాకమైంది. రవీంద్రనాథ ఠాగోర్ రాసిన జనగణమన మన జాతీయ గీతమైంది. వీటిని మనం ప్రేమిస్తున్నాం. గౌరవిస్తున్నాం.


దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్ అన్నాడు గురజాడ. ఆ మనుషుల్ని ప్రేమించడం, వారికి భద్రజీవితాన్ని కోరుకోవడం, అందుకు కృషి చేయడం నిజమైన దేశభక్తి.

మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి





సైంటిస్ట్

## ఆధునిక భారతీయ ఖగోళ శాస్త్ర పితామహుడు

# ఎం.కె. వైను బప్పు







మనాలి కల్లాత్ వైను బప్పు భారతీయ ఖగోళ శాస్త్రవేత్త. 1927 ఆగస్ట్ 10న జన్మించాడు. తండ్రి హైద్రాబాద్‌లోని నిజామియా ఖగోళ పరిశీలనాలయం సీనియర్ శాస్త్రవేత్త. స్వస్థలం కన్ననూర్. వైను బప్పు విద్యాభ్యాసం అంతా హైద్రాబాద్‌లోనే జరిగింది. వైను బప్పుకు చిన్నతనం నుంచే ఖగోళ శాస్త్రం పట్ల ఆసక్తి ఎక్కువ. నిజామియా పరిశీలనాలయంలోని టెలిస్కోపును చిన్న వయస్సులోనే సందర్శించాడు. రాత్రిపూట ఆకాశంలోని అద్భుతాలు ఆయనను బాగా ఆకర్షించాయి. ఖగోళ శాస్త్ర పరిశీలన వైపు ప్రయాణించాడు.

కళాశాలలో ఉన్నప్పుడే స్పెక్ట్రోగ్రాఫ్ నిర్మించాడు. కళాశాలలో విజ్ఞాన శాస్త్ర క్లబ్ స్థాపించి దాని పత్రికను ఎడిట్ చేసేవాడు. కళాశాల భౌతిక శాస్త్ర అసోసియేషన్‌కు సెక్రటరీగా ఉన్నాడు. 1943లో హైద్రాబాద్‌లో సి.వి. రామన్ ప్రసంగాలు అనేకం విన్నాడు. వైను బప్పు మద్రాస్ విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ డిగ్రీ తీసుకున్న తర్వాత కార్నెగీ స్కాలర్‌షిప్‌తో ఉన్నత విద్య కోసం హార్వర్డ్ యూనివర్సిటీలో చేరాడు. తన సహచరులు బార్ట్ జోక్, గోర్డన్ న్యూకిర్క్‌లతో కలసి కొత్త ధూమ కేతువును కనుగొన్నాడు: ఈ ధూమకేతువును 'బప్పు బోక్ న్యూకిర్క్' అనే పేరుతో పిలుస్తున్నారు. 1952లో ఖగోళ శాస్త్రవేత్త రోలన్ విల్సన్‌తో కలిసి పాలోమార్ పరిశీలనాలయంలో ప్రత్యేక రకాల నక్షత్రాల్లోని ప్రకాశ నిక్షేపం మరియు వాటి స్పెక్ట్రికల్ లక్షణాల మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించారు. దీనితో 'బప్పు - విల్సన్' ప్రభావం అనే శాస్త్రీయ సూత్రం వెలుగులోకి వచ్చింది. 2.3 సెంటి మీటర్ల వ్యాసంగం దేశీయంగా రూపొందించిన టెలిస్కోపును తమిళనాడులోని కవలూరు అబ్జర్వేటివ్‌లో ప్రతిష్టించారు. ప్రారంభ వైను బప్పు గౌరవార్థం వైను బప్పు ఖగోళ పరిశీలనాలయం అని దీనికి పేరు పెట్టారు.

అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర సమాఖ్యకు అధ్యక్షులుగా, కొడైకెనాల్ ఖగోళ శాస్త్ర పరిశీలనాలయానికి డైరెక్టర్‌గా పని చేసాడు. బెంగుళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ స్థాపనలో కీలకపాత్ర పోషించాడు. 1949లో ఫసిఫిక్ ఖగోళ సమితి నుండి డన్హో ధూమకేతు పతకం, బెల్జియం సైన్స్ అకాడమీ గౌరవ విదేశీ సభ్యత్వం, అమెరికన్ ఖగోళ సమితి గౌరవ సభ్యతం వంటి గౌరవాలు ఎన్నో దక్కాయి.

ఆస్ట్రో నామికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎం.కె. వైనుబప్పు జ్ఞాపకార్థం ఒక నిధిని ఏర్పాటు చేసింది. అంతర్జాతీయ స్థాయిలో ఖగోళ భౌతిక శాస్త్రరంగంలో కృషి చేసిన 35 సంవత్సరాలకు మించని యువశాస్త్రవేత్తలకు వైను బప్పు పేరిట అవార్డును ఏర్పాటు చేసింది. బంగారు పతకాన్ని ప్రశంసా పత్రాన్ని బహూకరిస్తున్నది. వైను బప్పు గొప్పకళాకారుడు. సాహితీప్రియుడు. ఇంగ్లీష్, ఉర్దూ సాహిత్యాల పట్ల గొప్ప అభిరుచి వుంది. మీర్జా గాలిబ్ ఆయన అభిమాన కవి.

వైను బప్పు 1982 ఆగస్ట్ 19న 55 ఏళ్ల వయస్సులో మరణించాడు.

– జుగాష్‌విలి

బాలచెలిమి డెస్క్, m : 83094 52998

✧ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



# చిత్రం

హలో ఫ్రెండ్స్, చాలా హడావిడిగా కనిపిస్తున్నారు. ఓ... ఆగష్టు 15 సంబురాల ఏర్పాట్లలో ఉన్నారా. అన్నట్లు మీ కార్యక్రమాలని ఒక జ్ఞాపకంగా, పదిలంగా దాచుకోవడానికి ఫోటోగ్రాఫర్‌ని పిలిచారా! మీ బడిలోని ప్రతి వేడుకని మళ్లీ మళ్లీ చూసుకోవడానికి వీలుగా ప్రత్యేకంగా ఒక ఫోటోగ్రాఫర్ ఉన్నాడా. మన ఇళ్లల్లో కూడా ప్రత్యేక సందర్భాలలో ఫోటోగ్రాఫర్ లేకపోతే అది ఒక లోటుగా భావిస్తాం కదా.

“Photography is a language more universed than words”.

గత తరాల చారిత్రక వారసత్వాన్ని, చరిత్రను, నిజ రూపాన్ని మనకళ్ల ముందు చిత్రరూపంలో బంధించి మనకు అందించే అవకాశాన్ని కెమెరా కల్పించింది.

మానవుని జీవితాన్ని అత్యధికంగా ప్రభావితం చేసిన చక్రం, విద్యుచ్ఛక్తి, ఫోన్ మొదలగునవి ఎలాగో ఫోటోగ్రఫి కూడా అనడం అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఒక మంచి క్షణాన్ని ఫోటో తీయలేకపోతే చరిత్రలో ఒక ముఖ్యమైన భాగాన్ని కోల్పోయినట్లే. అంటే ఒక ఫోటో, ఫోటోగ్రాఫర్ పరిస్థితిని మార్చలేడు. కానీ ప్రపంచానికి చూపించగలడు. దాని ద్వారా భవిష్యత్తులో మార్పురావచ్చు.

ఫోటోగ్రఫీ అనేది గ్రీకు పదం. ఫోటో అంటే కాంతి, వెలుతురు, గ్రాఫి అంటో గీయడం. ఫోటోగ్రఫీ అంటే కాంతితో చిత్రాన్ని గీయటం అని అర్థం చేసుకోవచ్చు.

కెమెరా అనగానే ఇప్పటి కెమెరా పూర్వరూపమైన కెమెరా అబ్స్ క్యూరా(చీకటి గది) గురించి దానిని కనిపెట్టిన అల్హాజెన్ గురించి తెలుసుకోవాలి. అల్హాజెన్ క్రీ.శ 965లో ఇరాక్‌లో పుట్టాడు. ఈయనని ప్రపంచంలో మొట్టమొదటి సైంటిస్ట్‌గా గుర్తిస్తారు. నమ్మేదాన్ని రుజువు చేయడమే సైన్స్‌కి ఉన్న ప్రధాన నియమం. దాని ప్రకారమే అల్హాజెన్ ప్రయోగాలను చేసాడు. అందుకే ఆయనని శాస్త్రీయ పద్ధతికి పితామహుడు అని భావిస్తారు.

పిల్లలూ.. అల్హాజెన్‌కు ఎన్ని శాస్త్రాలలో జ్ఞానం ఉందో తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఖగోళ శాస్త్రం, రసాయన శాస్త్రం, గణిత శాస్త్రం, మెడిసిన్, ఫిజిక్స్, ఆప్టిక్స్ మొదలగు శాస్త్రాలతో పాటు పొయట్రి, సంగీతం కూడా ఆయనకు ఇష్టమైన విషయాలు. ఆధునిక ఫోటోగ్రఫీకి ఆధారమైన ఎన్నో సూత్రాలను కనిపెట్టారు. అంతేకాక అద్దాలతో (లెన్స్) చేసిన ఎన్నోప్రయోగాలే మొదటి కళ్లజోడులు, మైక్రోస్కోప్‌లు, టెలిస్కోప్‌లు రూపుదిద్దుకోవడానికి మార్గదర్శకంగా నిలిచాయి. ‘బుక్ ఆఫ్ ఆప్టిక్స్’ అనే గ్రంథాన్ని ఏడు సంపుటాలుగా రాసాడు. 13వ శతాబ్దంలో అరబిక్ నుండి లాటిన్ భాషలోకి అనువాదం చేయబడింది.

మొదటి కెమెరా అంటే కెమెరా అబ్స్ క్యూరా అనే పేర్కొనాలి. అల్హాజెన్ కెమెరా అబ్స్ క్యూరాను ఫోటోగ్రఫీకి అనుగుణమైన సూత్రాలతో కనిపెట్టాడు. ఈ పరికరంలో ఒక చీకటి గది ఉంటుంది. అందులోకి పిన్ను సైజులో ఉన్న చిన్న రంధ్రం ద్వారా వెలుగు లోపలికి ప్రవేశించి, గది బయట ఉన్న బొమ్మని గది లోపల గోడ మీద

తలక్రిందులుగా చూపిస్తుంది. ఈ బొమ్మలను పూర్తిగా లేదా శాశ్వతంగా క్యాప్చర్ చేయడానికి క్రీ.శ.1800లలో కెమెరా అబ్స్ క్యూరాకు ఫోటోగ్రాఫిక్ ప్లేట్లను జత చేశారు. దాని ఫలితమే ఈనాటి ఆధునిక కెమెరా రూపుదిద్దుకుంది.

కాలగర్భంలో కలిసిపోయే ఎన్నో విషయాల స్వీట్ మెమరీస్‌కు ఫోటోలే నిదర్శనం. ఎన్నో భావాలను ఒక్క ఫోటోతో తెలియజేసే శక్తి ఫోటోగ్రఫీకి ఉంది. బ్లాక్ అండ్ వైట్‌తో ప్రారంభమైన ఫోటోగ్రఫీ కాలానికి అనుగుణంగా కలర్‌ఫుల్‌గా మారింది. రోజు రోజుకు ఎన్నెన్నో ప్రత్యేకతలను పరిచయం చేస్తూ, కొత్తపుంతలు తొక్కుతోంది. ఫ్రాన్స్‌కి చెందిన లూయిస్ డాగ్యురే 1837లో ఫోటోగ్రఫి ప్రాసెస్‌ని కనుగొన్నాడు. 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్ ప్రభుత్వం ఫోటోగ్రఫి పై పేటెంట్ హక్కులను కొనుగోలు చేసి దానిని ప్రపంచానికి ఉచిత బహుమతిగా అందించింది. అందుకే ఆగస్టు 19వ తేదీన ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. తరువాత క్రమంగా 1867లో కలర్ ఫోటోగ్రఫీతో పాటు ఈస్టమన్ ఫోటోగ్రఫీ, ఆ తరవాత డిజిటల్ ఫోటోగ్రఫీ అందుబాటులోకి వచ్చింది. జార్జ్ ఈస్టమన్ అనే అమెరికన్ కొడాక్ కెమెరాలను మొదట తయారు చేసాడు.

భారతదేశానికి 1857 వరకు ఫోటోగ్రఫీ అందుబాటు లోకి రాలేదు. అప్పుడు కూడా బ్రిటిష్ రాజు, జమీందారులు, సిపాయిలు మాత్రమే దీనిని వినియోగించేవారు. 1877 నుండి భారతదేశంలోని సామాన్యులకు ఫోటోగ్రఫీ అందుబాటులోకి వచ్చింది. ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రఫిక్ కౌన్సిల్ 1991 నుండి ప్రతిసంవత్సరం 'ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని' జరపడం ప్రారంభించింది.

ఆనాటి కెమెరా చిన్నగది అంత సైజులో ఉంటే, ఈనాటి కెమెరా అరచేతిలో పట్టేంత సైజులో ఉంది. ఈ కెమెరానే సినిమా పరిశ్రమకి ఊపిరిపోసింది. అలాగే ఈనాడు సిసి కెమెరాలు లేని కార్యాలయాలు, రహదారులు లేవని చెప్పవచ్చు. రక్షణ వ్యవస్థలో వీటి పాత్ర ఎంతో గణనీయమైనది. ఫోటోగ్రఫీని ఒక కళగా ఆరాధిస్తూ, దానిపై మక్కువతో ఎన్నో పోటీలను కూడా నిర్వహిస్తున్నారు. అనుబంధాలను అపురూపంగా బంధించగలిగేది కేవలం ఫోటోనే అనేది ఎవరూ కాదనలేని సత్యం. ఎన్ని డిజిటల్ కెమెరాలు వచ్చినా పాతతరం వారి అనలాగ్ కెమెరాలకి కూడా ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం సెల్ ఫోన్‌లో ఉన్న కెమెరాతో ప్రతి ఒక్కరు ఫోటోగ్రాఫర్‌గా మారిపోయారు. ప్రతి సెకనును సెల్ఫీ రూపంలో దాచుకుంటున్నారు. దేనికైనా అతి మంచిది కాదు. ఈ మధ్య సెల్ఫీ మోజులో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం చూస్తున్నాం. కనుక ఫోటోగ్రఫీని కళగా భావిస్తూ, జీవితంలోని అందమైన సందర్భాలను పదిలంగా దాచుకుందాం.

"Don't shoot what it looks like. Shoot what it feels like".

– డా. నీరజ అమరవాది
m : 9849160055

చందదారులుగా చేరండి!

బాల చెలిమి

చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**

**BALA CHELIMI**
**"CHANDRAM"** 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సం॥లకు | : రూ. 750 |

*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*


**ACCOUNT DETAILS :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

# మేరీ కోమ్

## రింగ్ లోపలి, వెలుపలి హద్దులపై ముష్టిఘాతాలు

‘అద్భుత మేరీ’గా అందరికీ తెలిసిన మేరీ కోమ్ (1982 నవంబర్ 24 – ) బాక్సర్, రాజకీయ వేత్త, పార్లమెంట్ మాజీ సభ్యురాలు. ప్రపంచ అమెచ్యూర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆరుసార్లు విజేతగా నిలిచిన తొలి మహిళ. మొదటి ఏడు ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో పతకాలు సాధించిన ఏకైక మహిళ. ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ (మహిళలు, పురుషులు) ఎనిమిది పతకాలు సాధించిన మొదటి బాక్సర్ కూడా.



2012 వేసవి ఒలింపిక్స్‌లో ఫ్లైవెయిట్ విభాగంలో కాంస్య పతకం సాధించి, భారత దేశం నుంచి మహిళల బాక్సింగ్‌లో అర్హత సాధించిన ఏకైక బాక్సర్గా నిలిచారు. దక్షిణ కొరియాలో 2014లో జరిగిన ఆసియా గేమ్స్ చరిత్రాత్మక బంగారు పతకాన్ని సాధించిన భారత తొలి మహిళా బాక్సర్. ఆసియన్ అమెచ్యూర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆరు సార్లు విజేతగా నిలిచి, ఆసియన్ బాక్సింగ్ తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

మేరీ కోమ్ అనేక పురస్కారాలు అందుకున్నారు, రాజ్యసభ సభ్యురాలిగా నామినేట్ అయ్యారు. బాక్సింగ్ జాతీయ పరిశీలకురాలిగా పని చేశారు. 2020లో కేంద్ర ప్రభుత్వం ఆమెను దేశంలో రెండో అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్‌తో గౌరవించింది.

తన జీవితంలో ఒక అథ్లెట్గా అనేక విజయాలు సొంతం చేసుకున్నారు. అలాగే భారత దేశ బాక్సింగ్ అభివృద్ధికి విశేష కృషి చేశారు.

**– ‘షీరోస్–256**
**ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా’** నుండి....

### మీకు తెలుసా?


‘మీథోయి లైమా’ (అసాధారణ మహిళ)గా మేరీ కోమ్‌ను మణిపూర్ ప్రభుత్వం గుర్తించి, గౌరవించింది. ఆమె గౌరవార్థం ఇంఫాల్‌లో ఒక రోడ్డుకు ఎంసి మేరీ కోమ్ అని పేరు పెట్టారు.

## 1991 - ఆంధ్రప్రదేశ్ విద్యాపథకంలో - భాగంగా గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం- గుర్తించే అక్షరాన్ని ఎర్రని సిరాతో రాయడం





ఎద్దుల బండిలో ఎక్కండి
ఎక్కాలు పెద్దగ చదవండి
"ఎలుక" పదంలో నేముందున్నా!
అది నేనెవరో తెలుపండి? "ఎ" అక్షరం




ఏనుగు పిల్లను పట్టెద్దాం
ఏకంగా మనమెక్కేద్దాం
ఏడు కొండలస్వామిని దర్శిద్దాం
"ఏనుగు"లో మొదటేముందీ? "ఏ" అక్షరం



ఐదు వేళ్ళు కుడి చేతికి
ఐదు వేళ్ళు ఎడమ చేతికి
ఐదుకు ఐదు కలిపితే పది
"ఐదు" ముందర ఏ అక్షరముంది? " ఐ " అక్షరం



ఒరల నడుమ కత్తి ఉంది
ఒక్క ఒరలో రెండు కత్తులుండవు
ఒకటికి ఒకటి కలిపితే రెండు
"ఒకటి"లో ముందు ఏ అక్షరముంది? "ఒ" అక్షరం




ఓడను కాగితంతో చేసింది అక్క
ఓడను నీటి గుంటలో వదిలాను
ఓడ గాలికి ఓరగ తిరిగింది
"ఓడ"లో ముందర ఏ అక్షరముంది? "ఓ" అక్షరం

- డా॥ జనపాల శంకరయ్య
m : 8074727108

కథ

# నేను అర్జున్ అవుతా!




వేసవి సెలవులు అయిపోయాయి. బడి తెరిచారు. ఆరో క్లాసులో ప్రణవ్ సెక్షన్‌లో కొత్తగా అర్జున్ చేరాడు. టీచర్లతోనూ, క్లాసులో పిల్లలందరితోనూ కొత్త లేకుండా మాట్లాడాడు. మధ్యాహ్నం భోజనం అయిపోయాక గ్రౌండ్‌లో ఆడకూడదని పిల్లలంతా చెప్పటంతో సాయంకాలం పి.టి. సర్‌ని అడిగాడు,

"సర్, ఇదివరకు బడిలో మధ్యాహ్నం భోజనం చేసాక కూడా ఆడుకునేవాళ్లం. ఇక్కడ ఆడకూడదని చెప్తున్నారు."

"ఎండలో ఆడకూడదు. లైబ్రరీలో కథలు చదువుకోండి." అన్నారాయన.

సాయంత్రం బడి నుంచి ఇంటికి వస్తుంటే అర్జున్‌ని అందరూ ఏవేవో ప్రశ్నలు అడిగారు. బడికి వచ్చేప్పుడు పుస్తకాలు, క్యారియర్ తనే సర్దుకుంటాడట. బూట్లు పాలిష్ చేసుకోవటం, హోం వర్క్ చేసుకోవటం అన్నీ తనేనట. ఇదివరకటి బడిలో ఎవరి పుట్టినరోజైనా అందరూ కలిసి మొక్కలు నాటేవారమని చెప్పాడు. ప్రణవ్‌కి అర్జున్ నచ్చేసాడు.

ప్రణవ్ పనులన్నీ అమ్మే చేసేస్తుంది. ఇప్పటిదాకా వాడు మొక్కలే నాటలేదు. ఇంట్లో మొక్కలకి నీళ్ళు కూడా పొయ్యలేదు. అమ్మ ఎప్పుడూ చదువుకొమ్మంటుంది. ఇంటికెళ్లి అమ్మతో అర్జున్ గురించి చెప్పాడు.

"అర్జున్ భలే పిల్లాడు, నీకు నచ్చినట్టున్నాడే. సరే, స్నానం చేసి హోం వర్క్ మొదలుపెట్టు." అమ్మ పని హడావుడిలో ఎప్పటిలాగే చెప్పింది. ప్రణవ్‌కి అమ్మ అలా చెప్పటం కాస్త విసుగ్గా అనిపించింది.

హోం వర్క్ అయ్యాక అమ్మ పుస్తకాలన్నీ బ్యాగ్‌లో సర్ది, "మా ప్రణవ్ గుడ్ బాయ్. పద, చెస్ సర్ వచ్చేసారు." అంది.

ప్రణవ్ అమ్మతో ఏదో చెప్పాలనుకున్నాడు. కానీ సర్ వచ్చేసేరని చెస్ బోర్డ్ తీసాడు.

నిద్రపోయే ముందు ''తాత ఊరు నుంచి ఎప్పుడొస్తాడు" అంటూ ప్రణవ్ అమ్మని అడిగాడు.

తాత పల్లె వెళ్లాడు. తాత, ప్రణవ్ మంచి స్నేహితులు. తాత ఊళ్లో ఉంటే ఆయనతో చెస్ ఆడుకునేవాడు. బోల్డు కథలు చెప్పించుకునేవాడు. తాత తనని "గుడ్ బాయ్" అంటాడు. తాత అర్జున్‌ని చూస్తే ఇంకా గుడ్ బాయ్ అంటాడు అనుకున్నాడు.

* * *

ఎప్పటిలాగే క్లాసులు అయిపోయాక ఆరో క్లాసు

పిల్లలు గ్రౌండ్‌లో ఒక పక్కగా క్రికెట్ ఆడుతున్నారు. ప్రణవ్ టీమ్‌కి, రాహుల్ టీమ్‌కి మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. మళ్లీ రాహుల్ వాళ్లే గెలిచారు.

అర్జున్ రాహుల్ దగ్గరకెళ్లి "మా టీంలో బాగా ఆడేవాళ్లు తక్కువ ఉన్నారు. రెండు టీములు కలిపేసి బాగా ఆడేవాళ్లని రెండింటి లోనూ సమానంగా పెట్టుకుందాం" అన్నాడు. రాహుల్ ఒప్పుకోలేదు.

"నువ్వు కొత్తగా చేరేవు. నీకు తెలియదులే. మేము టీములని ఎప్పటినుంచో ఇలానే పెట్టుకున్నాం. ప్రణవ్ నీలా ఎప్పుడు గొడవ చెయ్యలేదు. వాడు గుడ్ బాయ్" అన్నాడు.

"కొత్తగా చేరితే ఏమిటి? ఎప్పుడూ ఒక్క టీమే గెలవాలా?" అన్నాడు అర్జున్. అర్జున్, రాహుల్ వాదించుకుని ఒకళ్లనొకళ్లు తోసుకుంటూ కిందపడి, కొట్టుకోవటం మొదలెట్టారు.

తొమ్మిదో క్లాసు పిల్లలు బాస్కెట్ బాల్ ఆడుతుంటే సర్ అక్కడ ఉన్నారు. గొడవ చూసి ఆయన వచ్చారు.

"ఎప్పుడూ ఇలా కొట్టుకోలేదుగా, ఏమైంది?"అంటూ ఇద్దర్నీ విడదీసారు సర్.

"చూడండి సర్, కొత్తగా వచ్చిన అర్జున్ గొడవలు పెడుతున్నాడు." అన్నాడు రాహుల్ చేతులకి, కాళ్లకి అంటుకున్న మట్టిని దులుపుకుంటూ.

"సర్, ప్రతిసారీ ఒక్క టీమే గెలుస్తోంది. కొత్తగా టీములని తయారు చేద్దాం అంటే రాహుల్ పోట్లాడుతున్నాడు."

రాహుల్ గట్టిగా "ఎప్పటి నుంచో ఇలాగే ఆడుతున్నాం." అన్నాడు.

"మీరిద్దరూ పదిరోజులు క్రికెట్ ఆడకండి. అదే మీకు శిక్ష. ఆటలు అందరి మధ్యా స్నేహాన్ని పెంచాలి. కొట్టుకుందుక్కాదు. ఈరోజుకి ఇంక ఇంటికెళ్లండి అందరూ." అన్నారు.

ఇంటికెళ్తూ పిల్లలందరూ అర్జున్ చెప్పింది రైటను కున్నారు. ఇన్నాళ్లూ తామంతా ఓడిపోతున్నా ఎవరూ ఇలా అడగలేదు అనుకున్నాడు ప్రణవ్. అర్జున్ ఇంకా ఇంకా నచ్చాడు ప్రణవ్‌కి.

మర్నాడు సాయంత్రం అర్జున్, రాహుల్ గ్రౌండ్‌లో దూరదూరంగా కూర్చున్నారు.

ఆడేందుకు లేదని ఇద్దరూ కోపంగా "నీ మూలంగానే" అంటూ అరుచుకున్నారు. రెండు రోజులయ్యాక ఇద్దరూ కాస్త దగ్గరగా కూర్చుని ఆడుతున్న వాళ్లకి తమ సలహాలు ఇవ్వటం మొదలుపెట్టారు. నాలుగు రోజులయ్యేసరికి ఇద్దరూ పక్కపక్కన కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ స్నేహితులై పోయారు.

ఆరోజు బడి నుంచి వచ్చేసరికి తాత ఊరి నుంచి రావటం చూసి ప్రణవ్ సంతోషపడ్డాడు. హోం వర్క్, చెస్ క్లాసు అయిపోయాక తాత దగ్గర చేరాడు. అర్జున్ గురించి విషయాలన్నీ చెప్పాడు.

"తాతా, వాడు నీకు కూడా నచ్చుతాడు. ఈరోజు మా క్లాసులో అనీష్ క్యారియర్ కింద పడిపోయింది. వెంటనే అర్జున్ తన క్యారియర్‌లో భోజనం వాడికి ఇచ్చాడు. మేమంతా కూడా మా భోజనం కొంచెం ఇచ్చాంలే ఇద్దరికీ."

ప్రణవ్ కళ్లల్లో మెరుపు, ఉత్సాహం చూసాడు తాత. ఇన్నాళ్లూ తామంతా ప్రణవ్‌ని చిన్నపిల్లవాడు అంటూ వాడిలో స్వంత ఆలోచనలను ప్రోత్సహించలేదు. నిజంగా పొరబాటే అనుకున్నాడు.

"తాతా, నాకు ఉత్తి గుడ్ బాయ్‌గా ఉండటం ఇష్టం లేదు. నేను పెద్దయ్యాక..."తాత పక్కలో దూరి గుసగుసగా ఏదో చెప్పబోయి ఆగి తాత ముఖంలోకి చూసాడు ప్రణవ్.

అర్థమైనట్టు తాత నవ్వాడు. తాతకి తెలుసు ప్రణవ్ చెప్పబోయేది. అయినా అడిగాడు,

"నువ్వు పెద్దయ్యాక ఏంటి... చెప్పు"

"తాతా, నేను పెద్దయ్యాక అర్జున్ అవుతా." వెంటనే చెప్పేసాడు.

"పెద్దయ్యాక ఎందుకు? రేపటి నుంచే అవకూడదా?" తాత నవ్వాడు.

"తాతా, నువ్వు నా మంచి స్నేహితుడు." అన్నాడు ప్రణవ్ సంతోషంగా.

– అనురాధ నాదేళ్ల
e: anuramana77@gmail.com




# కలలు నిజం కావాలంటే...

దేశాధ్యక్షులు కలాం గారు కలలు కనండి అని, వాటిని నిజం చేయండి అని పిల్లలకు చెప్పేవారు అంటారు.

కలలు కని, పట్టు వదలకుండా వాటిని గురించి ప్రయత్నించి గొప్పవారైన వారి గురించి వింటే మనం కూడా కలలు కనాలి అనిపిస్తుంది.

జేన్ గుడాల్ అన్న పేరు చాలా మందికి తెలియక పోవచ్చు. నిజంగా గొప్పవారు అని ఉంటే ఆమె మాత్రం వాళ్లలో ముందు వరుసలో నిలుస్తుంది. జీవితమంతా అడవులలో బతికి చింపాంజీలను గురించి పరిశోధించిన జీన్ గుడల్ అందరూ గుర్తుంచుకోదగిన వ్యక్తి. 90 సంవత్సరాల వయసు గల ఆవిడ ఇవాల్టికి వన్యప్రాణుల సంరక్షణ కోసం తన పేరున ఒక సంస్థను పెట్టి విపరీతంగా కృషి చేస్తున్నారు.

జేన్ గురించి ఒక బొమ్మల పుస్తకం ఉంది. (ఆమె గురించి నేను తెలుగులో ఒక పుస్తకం రాసిన సంగతి ఇక్కడ అప్రస్తుతం కాదని అనుకుంటున్నాను.) పాట్రిక్ మెక్ డనల్ రాసిన ఆ పుస్తకంలో జేన్ చిన్నతనంలో కన్న కలలను గురించి బొమ్మలతో సహా చెప్పారు. చిన్నతనంలోనే ఆమె మనసులో నాటుకున్న ఒక ఆలోచన ఆమె జీవితానికే రూపం పోసింది. ఆమె బతుకంతా ఆ అంశానికే అంకితం అయింది. చింపాంజీలను, వాటి జీవన విధానాలను గురించి ఆమె కనుగొన్న వివరాలు అందరినీ ఆశ్చర్యం లో ముంచాయి.

జేన్ ఈ ప్రపంచంలోనే ప్రసిద్ధురాలు అయిన పరిశోధకురాలు. బ్రిటిష్ ప్రభుత్వం వారు ఆమెకు డేమ్ అనే గౌరవ బిరుదాన్ని ఇచ్చారు. ఆమె పరిశోధనకు గాను విశ్వవిద్యాలయాలు ఆమెకు డాక్టరేట్ పట్టాను ప్రదానం చేశాయి. అయినా ఈ పుస్తకంలో ఉన్నది మాత్రం చిన్ననాటి పాపాయి జెన్ గురించి.

పది సంవత్సరాలు పాపాయిగా ఉన్నప్పుడే ఆమె తాను ఆఫ్రికా వెళ్లి అక్కడ జంతువుల జీవితాలను గురించి పరిశోధించాలి అనుకున్నది. నిజానికి ఆ సమయానికి వారి కుటుంబం పెద్ద కలిగిన వారు కూడా కారు. ఆ కాలంలో అమ్మాయిలు పరిశోధనలో దూరి పట్టుదలగా పని చేయడం అన్న అలవాటు కూడా లేదు. అందరూ నీవు అనుకుంటున్నది కుదరదు అని చెప్పి నిరాశపరిచిన వారే. అయినా ఆమె తన కలలను నిజం చేసుకున్నది.

జేన్‌కు చిన్నప్పుడు జూబిలీ అనే గుడ్డ బొమ్మను ఎవరో బహుమతిగా ఇచ్చారు. పుస్తకంలోని కథ అక్కడే మొదలవుతుంది.

పాపాయికి ఆ బొమ్మ ఎంతో ఇష్టమైనదిగా మారింది. అది లేకుండా ఆమె ఎక్కడ ఎప్పుడు కనిపించేది కాదు.

నిజానికి ఇప్పుడు కూడా ఆ బొమ్మ ఆమె దగ్గర ఉంది. ఇంట్లో ఉన్న బయట ఉన్న జేన్ ఆ బొమ్మను వెంటబెట్టుకుని తిరిగేది. ఇంచుమించు బతుకునంత దానితో పంచుకున్నది. ఆమెకు అది బొమ్మ కాదు. ఒక బతుకు తోడు. ఆ తోడుతో కలిసి ఆమె ప్రకృతిని పరిశీలించింది. పక్షులను, పురుగులను, ఉడుతలను మరిన్నింటినో ఇద్దరూ కలిసి చూచి ఆనందించారు.

రాత్రిపూట అమ్మాయి తన పుస్తకాల నుంచి గట్టిగా చదివి ఆ బొమ్మకు వినిపించేది. పగలు చూచిన అంశాలు అన్నింటిని గురించి ఎన్నెన్నో వివరాలు ఇద్దరు కలిసి తెలుసుకున్నారు. గుడ్లు ఎక్కడి నుంచి వస్తాయి అని ఒకనాడు ఆ పాపాయికి అనుమానం కలిగింది. బొమ్మతో సహా నానమ్మ గారి కోళ్ల గూటిలోకి దొంగతనంగా దూరి గుడ్ల గురించి ఆమె తెలుసుకున్నది. అది ఆమెకు ఒక అద్భుతంగా కనిపించింది. ఆ ఆశ్చర్యాల ఆనందాల ప్రపంచంలో తాను కూడా ఒక భాగం కావాలని పాపాయి అనుకున్నది.

చిన్నారి జేన్ చెట్లు ఎక్కడం ఇష్టపడేది. అప్పుడు కూడా జూబిలీ బొమ్మ మాత్రం ఆమె వీపు మీదే ఉండేది. చెట్టు మీద కూర్చుని జేన్ పుస్తకంలో నుంచి టార్జాన్ గురించి చదివి జూబిలీకి వినిపించేది. ప్రియురాలి పేరు జేన్. అది తానే అనుకునేది మన జేన్. తనను తాను ఆఫ్రికా అడవులలో తిరుగుతున్నట్టు ఊహించుకునేది.

రాను రాను ఆ ఆలోచన కలలో కూడా రావడం మొదలుపెట్టింది. అది ఎంతో గాఢమైన కోరికగా మారింది. జంతువులను గురించి అర్థం చేసుకొని వాటికి సాయం చేయాలన్న కోరిక మనసులో నిండింది. రాత్రిపూట కూడా బొమ్మను పక్కనే పెట్టుకుని పాపాయి పడుకొని కలలు కనేది. జేన్ గుడాల్ ఆఫ్రికాలో పరిశోధనలకు చిన్న వయసులోనే కుదరడం కూడా ఆశ్చర్యకరంగానే జరిగింది. మిత్రురాలిని చూడడానికి వెళ్లిన ఆమెకు అక్కడ పరిశోధన అవకాశం చేతికి అందింది. కానీ ఈ బొమ్మల పుస్తకంలో మాత్రం అదంతా పక్కన పెట్టి కలలోనే ఆమె ఒకరోజు ఆఫ్రికాలో ఉన్నట్టు రాశారు రచయిత. పిల్లలకి అటువంటి విషయాలు సులభంగా నచ్చుతాయి కదా మరి! కలలో మన పాపాయి గోంబి లోని అడవులలో నిద్ర లేచింది. కానీ నిజానికి ఆ కల నిజమైంది. ఆమె జీవితమంతా గోంబీ అడవులలోనే గడిచింది. అక్కడ ఆమె అసాధారణమైన విషయాలను కనుగొన్నది. ఆ జీవితం ఎందరికో ఆదర్శంగా మారింది.

తరువాతి కాలంలో జేన్ అన్న కొన్ని మాటలు మనమంతా గమనించాలి. చుట్టూ ఉన్న ప్రపంచం మీద ప్రభావం చూపించకుండా మనం ఒక్కరోజు కూడా బతకకూడదు. మనం ఏం చేయగలుగుతామో అన్నది మన చేతుల్లోనే ఉంది. పిల్లలకైనా తాము చేసిన కృషి వల్ల కలిగే ఫలితాలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి, అన్నది ఆమె ఒక సందర్భంలో.

జేన్ గుడాల్ గురించిన ఈ బొమ్మల పుస్తకం ప్రపంచంలోని జీవిత చరిత్రలో ప్రధాన స్థానానికి చేరింది. గట్టి నిశ్చయంతో తాను కన్న కలలను నిజం చేసుకున్న ఈ పరిశోధకురాలు అందరికీ ఆదర్శ వ్యక్తి.

– గోపాలం కె బి
m : 98490 62055

## సామెతలు


- అంతా తెలిసిన వాడు లేడు, ఏమీ తెలియని వాడూ లేడు.
- ఆమడలు దూరమైతే అంతఃకరణాలు దూరమవుతాయా.
- ఇసుకలో తాడు పేనినట్లు.
- ఈవలి గట్టున ఉండే ఆవుకు ఆవలి గట్టు పచ్చన.
- ఉయ్యాలలో బిడ్డను పెట్టి, ఊరంతా వెతికినట్లు.
- ఊరందరిదీ ఒకదారి ఉలిపి కట్టెదొక దారి.
- ఎంత పెద్ద గుమ్మడి కాయైనా కత్తి పీటకు లోకువే.
- ఏటి ఒడ్డున చేను, చీటికి మాటికి భయం.
- ఒక చెయ్యి తట్టితే చప్పుడవునా.

– బాలచెలిమి

సీరియల్-3

# బంగారు మర్రి

(బాలలకోసం ఆధునిక సాహస నవల)




(గత సంచిక తరువాయి...)

మృగరాజు సింహం, ఏనుగు, ఎలుగుబంటి, నక్క, కోతి బంగారుమర్రి చేరుకున్నాయి. వేటగాళ్లు చిక్కకుండా జీపులో తప్పించుకున్నందుకు బాధ పడ్డాయి.

పులి ఎక్కడున్నా క్షేమంగా ఉంచాలని, తిరిగి తమ వద్దకు రప్పించమని బంగారుమర్రిని చేతులు జోడించి వేడుకుంది సింహం.

బంగారుమర్రి చాలా శక్తివంతమైన మహిమలు కలదని వన్యప్రాణుల నమ్మకం. కోరిన కోరికలు తీర్చుతుందని గట్టి విశ్వాసం. కొద్ది సేపటికి మృగరాజు బంగారుమర్రిని విడిచి తన గుహకు చేరుకున్నాడు. ఏనుగు, ఎలుగుబంటి, కోతి, నక్క బంగారుమర్రి వద్దనే కూర్చుని ముచ్చట్లాడుకుంటున్నాయి.

"మన మృగరాజు సింహంకు పులిరాజంటే చాలా ప్రేమ. వారి స్నేహాన్ని ఎవరూ విడదీయలేరు" అంది కోతి.

"పులిరాజుకు మాయమాటలు చెప్పి తన రాజ్యాన్ని మృగరాజు తన రాజ్యంలో కలుపుకున్నాడటగా!" అంది నక్క.

"నీలా మాయమాటలు, అబద్ధాలు చెప్పి మోసం చేయటం ఎవరికీ చేతకాదు! వారిది నిజమైన స్నేహం. మా పులిరాజే మన మృగరాజుకు తన రాజ్యాన్ని కానుకగా యిచ్చాడు. ఈ నక్క అబద్ధాలు మీరు నమ్మకండి. మీకు ఈ నక్క అబద్ధాల గురించి చెపుతా వినండి" అంది కోతి.

అవి ఆసక్తిగా చెప్పమని దగ్గర కొచ్చాయి. కోతి మృగరాజు, పులిరాజుల స్నేహం ఎంత బలమైందో ఇలా చెప్పింది.

ఒకప్పుడు పులిరాజు పక్క అడవికి రాజు. మన మృగరాజు, పులిరాజుకు మధ్య మంచి స్నేహం ఉండేది.

పులిరాజు ఆకలైతేనే జంతువుల్ని వేటాడి చంపేది. అలాగని మావంటి చిన్న జంతువుల జోలికి అస్సలు వచ్చే వాడు కాదు. ఎప్పుడూ పెద్ద జంతువులను చంపేది. ఆకలి లేకపోతే పెద్ద జంతువు తన ముందు నుంచి పోయినా కనీసం గాండ్రించేది కూడా కాదు.

చిన్న, చిన్న జంతువులు, పక్షులు పులిరాజు ముందు గెంతులు వేసేవి.

పక్షులు భయంలేకుండా దానిముందే వాలి రాలిన గింజలను ఏరుకు తినేవి. ఆ జంతువులకు, పక్షులకు,

పులంటే అంత చనువుంది! ఒక్కోసారి వాటికి ఏదైనా సహాయం, సలహా కావాలన్నా అవి పులినే అడిగేవి.

ఇలావుండగా... ఒకసారి ఎండాకాలంలో ఎండలు ఎప్పుడూ లేనంతగా వచ్చాయి. దాంతో అడవిలో కొంత భాగం పూర్తిగా ఎండిపోయింది. వర్షాలు సమయానికి రాకపోవడంతో అడవిలోని వృక్షాలు కూడా సరిగ్గా చిగురించలేదు. పచ్చగా కళకళలాడే గడ్డి కూడా మొత్తం ఎండిపోయింది. అక్కడ ప్రవహించే నదులు, చెరువుల్లో చుక్క నీరు లేకుండా ఎండిపోయింది.

దీంతో అడవిలో వుండే చిన్న జంతువులు, పక్షులు పులి వద్దకు వచ్చాయి.

"పులిరాజా! పులిరాజా! మీరే మమ్మల్ని కాపాడాలి!" వినయంగా అడిగింది కుందేలు.

"చెప్పండి! మీకొచ్చిన కష్టమేమిటి?" అడిగింది పులి.

"రాజా! కష్టకాలమొచ్చింది. తినడానికి పచ్చని చిగుర్లు, కందమూలాలు లేకుండా అయింది" అంది కుందేలు.

"చెరువులు ఎండిపోయి అసలు తాగటానికి కూడా నీళ్లు లేవు" అంది జింక.

"మా చిట్టి కూనలు చెట్లకు ఆకులు రాలినట్లు ఎండలకు గూటిలోంచి నాలుక చాచి కింద పడుతున్నాయి" అంది చిలక.

పులికి విషయం అర్థమైంది. వాటిని ఆపద నుండి రక్షించాలనుకుంది.

పులి ఒక్కక్షణం కళ్లు మూసుకుని ఆలోచించింది. ఆ వెంటనే "మిత్రులారా! పక్కనున్న అడవిలో ఇంత కరవు లేదు. అక్కడి చెరువులు నిండా నీరుంది. చెట్లనిండా ఆకులు, పండ్లు ఉన్నాయి. పచ్చటి గడ్డి కూడా ఉంది. మీరు అక్కడికి వెళ్లండి. అక్కడ నా ప్రాణమిత్రుడు సింహం ఉంటాడు. నేను పంపానని చెప్పండి. మీకు రక్షణగా ఉంటాడు. అతడు మిమ్మల్ని ఆదుకుంటాడు. కొంతకాలం అక్కడ ఉండి తిరిగి రండి!" అంది పులి.

"అలాగే పులిరాజా!" అంటూ చిన్న జంతువులు, పక్షులు పాలోమంటూ పయనమయ్యాయి. దారిలో మాకు మన జిత్తులమారి నక్క ఎదురైంది. గుంపుగా వస్తున్న మమ్మల్ని చూసి విషయం తెలుసుకుంది.

"తెలివితక్కువ దద్దమ్మల్లారా! మా అడవిరాజు సింహం సంగతి మీకు తెలీదు. మీ అడవిలో పులిరాజు వలె మంచిది కాదు. మిమ్మల్నందర్నీ ఒక్క రోజులోనే గుటకాయస్వాహా చేస్తుంది" అంటూ పెద్దగా నవ్వింది. నక్కమాటలకు ఆ జంతువులు, పక్షులు భయపడ్డాయి.

"నా మాట విని మీరు వచ్చిన దారిలోనే తిరిగి వెనక్కి వెళ్లి ప్రాణాలు రక్షించుకోండి" అని భయపెట్టింది నక్క. అవి అన్నీ తక్షణ కర్తవ్యం ఏమిటా అని ఆలోచించుకో సాగాయి.

అప్పుడు నేను "మిత్రులారా! మనం తిరిగి వెనక్కి వెళ్లినా ఆహారం లేక ఎలాగో చనిపోతాం! అదేదో సింహం చేతిలోనే చనిపోదాం!" అన్నాను.

దాంతో అన్నీ ముందుకే కదిలాయి. పక్క అడవిలోకి ప్రవేశించగానే మాకు సింహం ఎదురైంది. సింహాన్ని చూడగానే మేము భయంతో వణికాము.

"ఎవరు మీరంతా!" గర్జిస్తూ అడిగింది సింహం. కుందేలు చేతులు కట్టుకుని వినయంగా చెప్పింది. సింహం చాలా సంతోషించింది. తన ప్రాణ మిత్రుడు పులి తనపై నమ్మకంతో మమ్మల్ని పంపినందుకు ఆనందించింది. మాకు రక్షణగా ఉంటానని మాట ఇచ్చింది.

అప్పుడు చిన్న జంతువులు, పక్షులు పులిరాజు చెప్పి పంపినప్పటికీ నక్క మాటలు నమ్మి సింహాన్ని అవమానించి నందుకు సిగ్గుపడ్డాము. మంచివారు మంచి వారితోనే స్నేహం చేస్తారు. పులి ప్రాణమిత్రుడు సింహం కూడా పులి లాంటిదే. మిత్రుడ్ని మించిన అద్దం లేదని గ్రహించామని చెప్పింది కోతి.

"నిజమే! మృగరాజు సింహం, పులిరాజు స్నేహబంధం చాలా గట్టిది. ఈ నక్క దొంగమాటలు నీకు అప్పుడే తెలుసా!" అన్నాయి.

"సరేలే.. కట్టి పెట్టండి మీ కబుర్లు. ఎదుటివారి గురించి చెపుతుంటే మీకు సమయమే తెలీదు. ఇంతకీ వేటగాళ్లు కాల్చుకు తింటుంది పులి మాంసం కాదు కదా!?" అనుమానం వ్యక్తపరిచింది నక్క.

(సశేషం...)

– పైడిమర్రి రామకృష్ణ
m : 9247564699

కథ

# పిల్ల కోతి నిర్లక్ష్యం

గంగాపురం అనే అడవిలో రెండు పిల్ల కోతులు ఉన్నాయి. వాటి పేర్లు బాలు, సిద్దు. అవి ప్రతి రోజు కలిసి మెలిసి చెట్లపై గెంతులేస్తూ ఆటలాడి ఆనందపడేవి. బాలు కోతి కి బద్దకం, నిర్లక్ష్యం ఎక్కువ. కొన్నిసార్లు ఎంత చెప్పినా వినేది కాదు. ఏ పని చేసినా మెల్లగా చేసేది. ఈ విషయంతో సిద్దు కూడా బాలు వలన చాలా ఇబ్బందులు పడుతుంది.

ఒక రోజు సిద్దు అడవిలో తిరుగుతుండగా సింహం, మిగతా జంతువులు మాట్లాడుకోవడం చూసింది. అవి ఏమి మాట్లాడుకుంటున్నారో నని సిద్దు చెట్టు పైన ఉండి వాటి మాటలు విన్నది.

“మన అడవిలోని చెట్లను నరికేసి, ఏదో ఫ్యాక్టరీ నిర్మిస్తారని తెలిసింది. చాలా మంది వచ్చి చూసి వెళ్తున్నారు. వీలైనంత త్వరగా మనం ఈ అడవిని ఖాళీ చేసి వెళ్ళిపోవాలి” అని సింహం అంది.

“ఈ అడవిని విడిచిపెట్టి మనం ఎక్కడికి వెళ్దాం. వారు వచ్చేవరకు చూద్దాము” అని కొన్ని జంతువులు అన్నాయి.

“మీ ఇష్టం” అని సింహం చెప్పింది.

ఈ విషయం విని సిద్దు భయపడింది. వెంటనే వెళ్ళి బాలుకు చెప్పింది. మనం వెంటనే వేరే అడవికి వెళ్ళుదాము అని చెప్పింది. బాలు పట్టించుకోలేదు. సింహం అబద్ధం చెప్పిందిలే అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చింది. వేరే అడవికి వెళ్దామని సిద్దు బాలుని ఎంతో బ్రతిమాలింది. బాలు వినలేదు.

మరుసటి రోజు సిద్దు అడవిని విడిచిపెట్టి వేరే అడవికి వెళ్ళింది. కొన్ని జంతువులు కూడా వెళ్ళాయి. బాలు అదే అడవిలో ఉన్నది. మిగతా జంతువులు కూడా బాలు వలే ఆలోచించి, అదే అడవిలో ఉన్నాయి. అదే రోజు రాత్రి వ్యాపారులు చాలా మంది కూలీలను, యంత్రాలను తెచ్చి అడవిలోని చెట్లని నరికేసారు. రాళ్ళను పేల్చి వేశారు.

జంతువులు, పక్షులు అన్ని అడవి అంతా ప్రాణ భయంతో పరుగెత్తి, చెట్ల క్రింద, రాళ్ళ క్రింద పడి చనిపోయాయి. బాలు కోతి పైన చెట్టు పడింది. బాలు ఎంత ప్రయతి ్నంచినా చెట్టును కొంచెం కూడా కదిలించలేక పోయింది. అప్పుడు మిత్రుడు సిద్దు గుర్తుకు వచ్చాడు. అతడు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి.

“సిద్దు మాటలు విని ఉంటే తనకు ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా, నిర్లక్ష్యం కారణంగా ప్రాణం పోయేలా ఉంది” అని బాధపడింది.


**నీతి : ఎవరైనా మన మంచి కోసం చెప్పితే, నిర్లక్ష్యం చేయకూడదు.**

– బి. విశ్వతేజ
7వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
అనంత సాగర్, సిద్దిపేట జిల్లా
సెల్. 9959007914



ఆట

# వంగుళ్ళు - దూకుళ్ళు



**ఎంత మంది పాల్గొన వచ్చు –**
**5 నుంచి 10 మంది**

**ఎక్కడ ఆడవచ్చు –**
**ఖాళీ స్థలంలో**

**ఈ ఆటకు గల ఇతర పేర్లు –**
**దుంకులాట, దుముకులాట**

'వంగుళ్ళు దూకుళ్ళు' ఆడే ముందుగా పంటలు వేసుకోవాలి. మిగిలిపోయిన బాలుడు దొంగవుతాడు. దొంగైన బాలుడు చేతులు మోకాళ్ళపై పెట్టి వంగుని ఉండాలి.

అతని మీద నుంచి మిగతా ఆటగాళ్ళంతా దూకుతూ ఉండాలి. దూకేటప్పుడు దూకేవాళ్ళ కాళ్ళు గాని, శరీరంలోని ఏ భాగమైన గాని వంగి ఉన్న బాలునికి తగలరాదు. అందరూ ఒక రౌండ్ అయిన తరువాత వంగి ఉన్న బాలుడు తన చేతులను కొద్దిగా పైకి జరిపి, కొంచెం పైకి లేవాలి.

ఇలా కొంచెం కొంచెం ఎత్తులు పెంచుతూ దూకుతుండాలి. ఎత్తు పెరిగిన కొద్ది దూకడం కష్టం అవుతుంది. దూకలేని వారు దొంగవుతారు. అప్పుడు అతను వంగి ఉంటే మిగతా వారు దూకాలి. ఇలా ఆట మళ్ళీ మొదలవుతుంది.

**ప్రయోజనం:** ఈ ఆట ద్వారా పిల్లల్లో చురుకుదనం అధికమవుతుంది. జీవితంలో ఎదురు పడే ఒడిదుడుకులను, అడ్డంకులను అవలీలగా అధిగమించే సామర్థ్యం చిన్నప్పుడే అలవడుతుంది.


– 'చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు' నుండి...

యాత్ర

## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# నదీ తీరాలు

## మన నాగరికతకు నిలయాలు




(గత సంచిక తరువాయి...)

భారత దేశంలో వందలాది నదులున్నా వాటిలో ముఖ్యమైన పన్నెండు పుష్కర నదులలో గోదావరి, కృష్ణా నదులు రెండూ తెలంగాణ ప్రాంతంలోనే ఉండటం ఒక విశేషం. కృష్ణా నది పశ్చిమ కనుమల్లోని మహారాష్ట్ర సతారా జిల్లాలో విస్తరించిన మహాబలేశ్వర్ కొండల్లోని జోర్ గ్రామం వద్ద జన్మించింది. మహారాష్ట్ర, కర్నాటక, రాష్ట్రాల గుండా ప్రవహిస్తూ నాటి మహబూబ్‌నగర్ జిల్లా నేటి నారాయణపేట జిల్లా క్రిష్ణా మండలం తంగడి గ్రామం వద్ద భీమానదితో కలిసి తెలంగాణాలో ప్రవేశిస్తుంది. ఇక్కడ నుంచి వనపర్తి, జోగులాంబ, గద్వాల, నాగర్‌కర్నూలు, నల్గొండ, సూర్యాపేట జిల్లాల గుండా కర్నూలు, ప్రకాశం, గుంటూరు, క్రిష్ణా జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహించి విజయవాడకు దిగువన 64 కి.మీ. దూరంలో రెండుగా చీలి మళ్ళీ హంసలదీవి (ఈ ప్రాంతాన్నే దివిసీమ అంటారు) వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. కృష్ణా అంటే నలుపు వెణ్ణా నదిని కలుపుకొని కృష్ణ వెన్న అంటే నల్లని నది అని కర్నాటకలో కన్న బెన్నగా పిలుస్తారు. ఈ నది మొత్తం పొడవు 1440 కి.మీ. తెలంగాణాలో ఈ నది సుమారు 450 కి.మీ. ప్రవహిస్తుంది. కృష్ణానది పాతరాతియుగం నుండి తొలి చారిత్రక యుగం వరకూ చరిత్ర పూర్వయుగం అంటే సుమారు మూడు లక్షల సంవత్సరాల మానవ మనుగడకు సంబంధించిన ఆనవాళ్ళను అందించింది. అలాగే బృహత్ శిలాయుగపు సమాధులు, వివిధ వింత ఆకారాల్లో ఉండే శవపేటికలూ నేడు మనం మ్యూజియంలో చూడవచ్చు. అలాగే ఈ నదీ తీరం వెంబడి చారిత్రక ఆనవాళ్ళను కలిగిన పర్యాటక స్థలాలు, దేవాలయాలు, కోటలు రాజధానుల నగరాలు మనకు నేడు దర్శనమిస్తున్నాయి. ఈ నదికి ఎడమ వైపు నుండి కలిసే ఉపనదులు భీమా నారాయపేట (మహబూబ్ నగర్), డిండి-నాగర్ కర్నూలు, మూసీ - వికారాబాద్, హాలియా - నల్గొండ, పాలేరు - జనగామ, మున్నేరు - వరంగల్ గ్రామీణ జిల్లాల గుండా ప్రవహిస్తున్నాయి. అలాగే, కుడి వైపు నుండి తుంగభద్ర - జోగులాంబ గద్వాల గుండా ప్రవహిస్తున్నాయి. ఈ తీరం వెంబడి ముడుమాల్, ఉప్పేరు, ఈర్లదిన్నె, శేరుపల్లి, రంగాపూర్, చిన్నమరూరు, పెద్దమరూరు, ఉప్పలపాడు, సింగవరం, చాగటూరు, పైడిగుట్ట, మల్లేశ్వరం, సోమశిల, అమరగిరి, కదళీవనం, అక్కమహాదేవి గుహలు, చంద్రగుప్త పట్టణం, పెద్దమునగాల, ఏలేశ్వరం, ఇర్కగూడెం, వెల్లటూరు తదితర స్థలాలు చారిత్రక ఆనవాళ్ళను అందించాయి.

నేడు విశ్వనగరంగా కీర్తించబడుతున్న హైదరాబాద్ నగరం మూసీ నది ఒడ్డునే విస్తరించి తెలంగాణా రాష్ట్ర రాజధానిగా వెలుగొందుతుంది. ప్రముఖ పురావస్తు పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి స్థపతి ఉదహరించిన "నగర సుందరి వయస్సు 400 ఏళ్ళు కాదు 4000 ఏళ్ళు" అన్నది అక్షర సత్యమే. హైదరాబాద్‌లోని ఆదిమ మానవుని ఆనవాళ్ళు హస్మత్‌పేట, మౌలాలీ, గచ్చిబౌలి కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రాతియుగపు సమాధులు, చైతన్యపురి (మూసీవరం) విష్ణుకుండినుల శిలాశాసనం బౌద్ధ ఆనవాళ్ళను అందిస్తుంది. ఇంకా ఇటీవలి కాలంలో శివనాగిరెడ్డి గారు ఇతర చరిత్ర పరిశోధకులు గుర్తించిన మలకం చెరువు సమీపంలో బి.ఎన్.ఆర్. హిల్స్‌లో ఆదిమ మానవుని ఆనవాళ్ళు కొత్త రాతియుగం చిత్రాలు మన విశ్వనగర చరిత్రను 6000 ఏండ్లకు తీసుకెళ్ళింది. విష్ణుకుండినుల రాజధాని ఇంద్రపాల నగరం (తుమ్మలగూడెం, యాదాద్రి భువనగిరి జిల్లా) బిక్కేరు తీరం వర్ధమానుకోట, గాజులబండ, ఫణిగిరి బౌద్ధ చారిత్రక కట్టడం, క్రిష్ణానదీతీరం ఇక్ష్వాకుల రాజధాని శ్రీ పర్వత విజయపురితో మన చరిత్ర ప్రస్థానం గోదావరి నుండి క్రిష్ణాతీరానికి చేరింది. ఎగువ గోదావరి స్థానిక రాజుల, శాతవాహనులకు ప్రతినిధి అయితే తర్వాత ఇక్ష్వాకులు, విష్ణుకుండినుల, బాదామీ చాళుక్యులకు క్రిష్ణానది ఆతిథ్యం ఇచ్చింది. క్రీ. పూర్వం ఆరవ శతాబ్దంలో బుద్ధుని జీవిత కాలంలోనే బావరి ద్వారా అప్పటి అస్మక జనపదం గోదావరి తీరం తొలినాళ్ళ బౌద్ధానికి పురుడు పోసింది. నేడు ప్రపంచ దేశాలలో రెండవ బుద్ధునిగా కొనియాడ బడుతున్న నాటి ఇక్ష్వాకుల రాజధాని శ్రీపర్వత విజయపురి, మహాయాన బౌద్ధవికాస కేంద్రం క్రిష్ణానది లోయ తీరం ఆచార్య నాగార్జుడిని అందించింది. ఇదీ! మన తెలంగాణలోని నదులు మనకు అందిస్తున్న - నదీ నాగరికత.


**- దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి**
m : 9010051177

మ్యాథ్స్ ట్రిక్స్

# ముందుగా జవాబు-1




1. ప్రేక్షకుని ఒక సంఖ్య అడగండి. ఎన్ని అంకెలైనా ఉండవచ్చు.
2. వెంటనే ఒక స్లిప్‌పై రహస్యంగా జవాబు రాసి అతడికి ఇవ్వాలి.
3. తర్వాత మరొక సంఖ్యను చెప్పమనాలి.
4. ఇప్పుడు మీరు చెప్పిన సంఖ్యను రాసుకోమనాలి.
5. ఆ మూడు సంఖ్యలను కూడమని చెప్పాలి.
6. ముందుగా రహస్యంగా రాసిన జవాబే వస్తుంది.

ఉదా:

| | |
|---|---|
| ప్రేక్షకుడు చెప్పిన సంఖ్య | 38695 |
| ప్రేక్షకుడు చెప్పిన మరొక సంఖ్య | 49260 |
| మెజిషియన్ చెప్పిన సంఖ్య | 50739 |
| | 138694 |

మెజీషియన్ ముందుగా (రహస్యంగా) రాసిన జవాబు 138694

**రహస్యం :** మొదట చెప్పిన సంఖ్యకు ముందు 1 వేయాలి. ఆ సంఖ్య నుండి 1 తీసివేసి తర్వాత జవాబుగా రాయాలి. రెండవసారి రాసిన సంఖ్యలోని అంకెలకు ఎంత కలిపితే 9 వస్తుందో ఆ బేధాలను మనం 3వ సంఖ్యగా చెప్పాలి.

38695 – 1 = 38694 ➜ 138694 జవాబు

49260 + 50739 = 99999

## BEAUTY NUMBER

**15873 x seven multiplies**

**15873 x 7 = 111111**

**15873 x 14 = 222222**

**15873 x 21 = 333333**

**15873 x 21 = 444444**

**15873 x 28 = 555555**

**15873 x 35 = 666666**

**15873 x 42 = 777777**

**15873 x 56 = 888888**

**15873 x 63 = 99999**


– అంకెల మామయ్య చంద్రయ్య
m: 9440926937




# సర్వకాల ఉత్సవం

# స్వాతంత్ర్య దినోత్సవం

తేజ: గుడ్ మార్నింగ్ తాత ఏమిటి తీరుబడిగా కూర్చున్నారు? ఆగస్టు నెల వచ్చేసింది. ఈ నెలలో మీ సీనియర్ సిటిజన్స్‌ది ఏదో కార్యక్రమం వుంది అన్నావ్?!

తాత: ఔను తేజ బాగానే గుర్తుంచుకున్నావు. ఈ నెలలో వచ్చే జెండా పండుగ గురించి నేటి యువతతో సంపూర్ణ స్వరాజ్య లక్ష్యం గురించి పెద్ద చైతన్య కార్యక్రమం చేపట్టబోతున్నాము.

తేజ: ఇప్పుడన్న చదువుల బిజీ షెడ్యూల్‌లో ఈ కార్యక్రమాలు అవసరమా? అయినా మనకు కావాల్సిన స్వాతంత్ర్యం వచ్చేసింది ఎవరి పనులు వాళ్లం చేసుకుంటున్నాము.

తాత: అదే మీ యూత్ చేస్తున్న పెద్ద తప్పు. అందుకే నేటి కాలంలో మీ విద్యాలయాల్లో మొక్కుబడి జెండా పండుగలు జరుగుతున్నాయి.

తేజ: అదేంటి తాతయ్య. అలా అంటావ్? మా స్కూళ్లు కాలేజీలో మా సార్లు అంతా పరిసరాలను అందంగా అలంకరించి ప్రతీ ఏడాది తప్పకుండా జెండా ఎగరేసి వందనం చేస్తూనే వున్నారు కదా?

తాత: అంటే నీ ఉద్దేశం ఏమిటి? ఎవరో ఒకరు జెండా ఎగరేసి ఒక సెల్యూట్ చేస్తే సరిపోతుందా?

తేజ: మరి ఏమి చేయాలి? రోజంతా జాతీయ గీతాలు, దేశభక్తి పాటలు పాడుకుంటూ వుండాలా? ఆ పనులు మన టీవిల్లో ఎలాగూ జరుగుతూనే ఉంటుంది గాని?! (నవ్వుతూ..)

తాత: ఇదే మీ తరం ఆలోచనలకు మా తరం ఆలోచనలకు తేడా? మీ దృష్టిలో జాతీయ జెండా అంటే మూడు రంగులు గల ఒక సాధారణ వస్త్రం! కాని మాకు అది పరమ పవిత్రం..

తేజ: అది ఎలా తాతయ్యా? చెప్పవా?! ప్లీజ్.

తాత: బ్రిటీష్ వారు మన దేశాన్ని ఆక్రమించి మన దేశంలోనే మనకు స్వేచ్ఛ లేకుండా చేసి మనవైన సంపదలను వారి దేశానికి తీసుకుపోవడమే గాక మన స్వేచ్ఛను మనం కోరుకోవడమే నేరంగా భావించి మన వారికి అతి కఠినమైన శిక్షలు వేసి ఎంత హేయంగా బాధించారో మీకేం తెలుసు??

తేజ: మేము అప్పుడు పుట్టలేదు కదా మాకెలా తెలుస్తుంది?

తాత: అందుకే చెబుతున్నాం అర్థం చేసుకుని కృతజ్ఞతా భావంతో సదా మన జాతి అమరవీరులకు అంజలి ఘటిస్తూ వారు నడిచిన మార్గంలో నడుస్తూ వారు చెప్పినట్టు ఆచరించమని, అదే అసలైన దేశభక్తి అని కూడా?!

తేజ: దేశభక్తి అంటే జెండా పండుగ రోజులో జెండాకు నమస్కరించడమే కదా?

తాత: అది ఒక్కటే కాదు. మన దేశ నాయకులు స్వరాజ్య సాధన కోసం చేసిన త్యాగం, ఐక్యతా భావం, సేవా భావం క్రమశిక్షణతో కూడిన సమయపాలన. అన్నీ దేశభక్తితో భాగాలే!! అవి మనమందరం ఆచరించడమే నిజమైన దేశభక్తి.

తేజ: మరి జెండాకు వందనం చేయడంలోని అర్థం ఏమిటి?

తాత: మన దేశం కోసం తమ ప్రాణాలు అర్పించిన అమరవీరులకు సూచిక, మన జాతీయ జెండా, దానిని సదా సగౌరవంగా పూజించడం పౌరులుగా మన బాధ్యత.

తేజ: ఓహో! అదా సంగతి అందుకే మన జాతీయ జెండాను ఎలా ఎక్కడ ఉపయోగించాలో దాని పద్ధతులు మా సోషల్ టీచర్ చెబుతుంటారు. అసలు ఈ జాతీయ పతాకం జాతీయ పర్వాల రోజు ఎలా ఎగరవేయాలి? ఎవరు ఎగరవెయ్యాలి? కాస్త వివరంగా చెప్పండి తాతయ్యా?

తాత: మంచి ప్రశ్న అడిగావు. మనకు ప్రధానంగా రెండు జాతీయ పండుగలున్నాయి. అవి (1) స్వాతంత్ర దినోత్సవం (2) గణతంత్ర దినోత్సవం.

తేజ: మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా చేసే ఈ పర్వదినం గురించి చెప్పండి.

తాత: ఇది ప్రజాస్వామ్యంకు సంబంధించిన పండుగ కనుక ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులు మాత్రమే జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు.

తేజ: అంటే దేశ రాజధానిలో ప్రధాన మంత్రి రాష్ట్రాల రాజధానుల్లో ముఖ్యమంత్రులు ఆవిష్కరిస్తారు కదా?!

తాత: 1974 ఆగస్టు 15 నుంచి నువ్వు అన్న విధంగా కొనసాగుతుంది అంతకు ముందు రాష్ట్రాల్లో గవర్నర్లు జాతీయ పతాకావిష్కరణ చేసే వారు.

తేజ: అదేమిటి గవర్నర్లు ప్రజలచే ఎన్నుకోబడలేదు కదా?!

తాత: అందుకే ఆ విధానాన్ని వ్యతిరేకిస్తూ నాటి తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి కేంద్రానికి అభ్యంతరం చెబుతూ లేఖ వ్రాయగా నాటి ప్రధాని ఇందిరాగాంధీ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు జాతీయ పతాకావిష్కరణలు చేయడానికి అనుమతి ఇవ్వడంతో అదే నేటికి కొనసాగుతుంది.

తేజ: అది సరే గాని అసలు జాతీయ పతాకం ఆవిష్కరణ చేయడానికి ఆ తంతుకు సంబంధించిన నియమాలు ఏవైనా ఉంటాయా?

తాత: మన దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగే పతాకావిష్కరణ తంతు ప్రామాణిక టీవిలో అందరం చూస్తూనే ఉంటాం.

తేజ: ఔను తాతయ్య నేను టి.వి.లో చాలా సార్లు చూసాను. కాని మా విద్యాలయాల్లో జెండా ఎగరవేయడానికి ముందు దేశ నాయకుల ఫోటోలకు పూల దండలు వేసి అగరవత్తులు పెట్టి కొబ్బరికాయలు కొట్టడం చేస్తారుగా? అవసరమా?

తాత: నేను నీకు ముందే చెప్పాను స్వాతంత్ర్య దినోత్సవం అంటే దాని కోసం త్యాగం చేసి చనిపోయిన వారిని స్మరిస్తూ ఆ పూలదండలు, కొబ్బరి కాయలు, అగరవత్తులు లౌకికవాదంలో భక్తి ఒక భాగం కనుక అది ఇష్టం అయిన వారు అలా చేస్తారు లేని వారు చేయరు.

తేజ: అలాగా! ఇక్కడ జాతీయ గీతం ఆలాపన మధ్య జాతీయ పతాకాన్ని దిగువ నుంచి పైకి లాగి ఆవిష్కరించడం మనం స్వాతంత్ర్యం పొంది స్వేచ్ఛగా వున్నామనడానికి గుర్తు కదా? తాతయ్య.

తాత: వెరీగుడ్ చాలా చక్కగా అర్థం చేసుకున్నావు కాని అంతే క్రమశిక్షణతో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో కూడా విధిగా పాల్గొంటూ నీ భారతీయత చాటుకుంటూ కృతజ్ఞతగా జీవించండి.

తేజ: ఓ...! నిజంగా తాతయ్య ఇప్పుడు నువ్వు చెప్పాకా అర్థమయ్యింది. జెండా పండగకు ఎందుకు హాజరు అవ్వాలో. ఇది సెలవు రోజు కాదు మన జాతి ఉన్నతి చాటుకునే పండుగ రోజు మా ఫ్రెండ్స్ అందరికి చెబుతా. మాలో మార్పు ఏమిటో ఇక మీరే చూస్తారు. బై తాతా....

– డా. అమ్మిన శ్రీనివాసరాజు

m : 7729883223

చెట్టు - చేమ

# జామ చెట్టు



హాయ్ బాలలు ఎలా ఉన్నారు? రోజూ బడికి వస్తున్నారు కదా! పాఠాలు చక్కగా చదువుతున్నారా? మనం జూలై నెలలో అరటి చెట్టు గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు జామ చెట్టు గురించి తెలుసుకుందాం. సరేనా...!

సాధారణంగా జామ చెట్లు మన ఇంటి ఆవరణలో గానీ, వ్యవసాయ బావుల వద్ద, తోటలలో బాగా పెంచుకుంటాం. జామ శాస్త్రీయ నామం psidium Guajava. జామ అనేది మిర్టేసి కుటుంబానికి చెందిన ఉష్ణ మండల పండ్ల చెట్టు. ఇది రుచికరమైన మరియు పోషకమైన పండ్లను ఇస్తుంది. మామూలుగా జామ చెట్లు సంవత్సరంలో రెండుసార్లు కాస్తాయి. జామ చెట్లు వివిధ రకాల నేలల్లో పెరుగుతాయి. జామ చెట్ల నుండి లభ్యమయ్యే జామ పండ్లు తినని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. నేటి కాలంలో హైబ్రిడ్ జామ మొక్కలు వినియోగంలోకి వచ్చాయి. నాటిన సంవత్సరం కాలానికే పండ్లనిస్తున్నాయి. జామ పండ్లను పిల్లలతో పాటు పెద్దలు తినడమే కాకుండా, రామచిలుకలు వంటి పక్షులు ఇష్టంగా తింటాయి. జామ పండ్లలో విటమిన్లు, ఖనిజాలు, మరియు ఆహార ఫైబర్లు సమృద్ధిగా ఉంటాయి. జామ పండ్లను సాధారణంగా స్నాక్స్‌గా, ఫ్రూట్స్ సలాడ్‌గా తీసుకుంటారు. జ్యూస్‌లు, జాములు డెసర్ట్‌లుగా తయారుచేస్తారు. జామ ఆకులను సాంప్రదాయ వైద్యంలో కూడా ఉపయోగిస్తారు. దీపావళి పండుగ రోజు నోము దగ్గర పాలవెల్లికి జామకాయలు, ఆకులు కడతారు. జామ పండ్లను తినడం వల్ల షుగర్ తగ్గిస్తుంది. ఈ పండ్ల తినడం వల్ల నిరోధక శక్తి పెరగడమే కాకుండా జీర్ణ క్రియ కూడా మెరుగవుతుంది. జామ పండ్లలో 'సి' విటమిన్ పుష్కలంగా ఉంటుంది. గుండె జబ్బుల నివారణకు, కొలెస్ట్రాల్ తగ్గించడానికి జామపండ్లు ఎంతో ఉపయోగపడతాయి. మలబద్ధకాన్ని కూడా నివారిస్తుంది. జామ పండ్లు తినడం వల్ల బరువు కూడా తగ్గవచ్చు. ఆరోగ్యకరమైన చర్మం కాంతివంతంగా ఉండడానికి జామ పండ్లు ఎంతో ఉపయోగపడతాయి. జామ పండ్లలో విటమిన్ 'ఎ' కూడా ఉంటుంది. ఇది కంటికి చాలా మంచిది. జామ ఆకుల రసం తిమ్మిర్లను తగ్గిస్తుంది. జామ ఆకు టీ తాగడం వల్ల నొప్పితో కూడిన పీరియడ్స్ ఉన్న మహిళలకు చాలా ఉపయోగం. క్యాన్సర్ వ్యాధిని నిరోధించడంలో కూడా జామకాయలు సహాయపడతాయి. ఇది ఒక సూపర్ ఫ్రూట్. జామ పండ్లను పగలు, మధ్యాహ్నం మాత్రమే తింటే మంచిది. దీని వల్ల కడుపు సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. మోషన్ ఫ్రీగా ఉంటుంది. జామ చెట్ల వల్ల ఔషధపరమైన ఉపయోగాలు కూడా ఉన్నాయి. జామ ఆకులు, బెరడు నుంచి తయారుచేసిన పదార్థాలు క్యాన్సర్, బ్యాక్టీరియా ద్వారా వచ్చే అంటువ్యాధులు, వాపులు, నొప్పి నివారణలో వైద్యంగా వాడుతున్నారు. జాము పండ్లను అతిగా తినకుంటే మంచిది. భారతదేశంలో చాలా రుచికరమైన జామ రకాలు ఎన్నో ఉన్నాయి. జామ పండ్లలో గుజ్జు బాగా ఉండి బాగా రుచికరంగా ఉంటుంది. జామ పండ్లు తినడం వల్ల ఒత్తిడి కూడా తగ్గుతుంది. చర్మం జుట్టు రాలకుండా ఉపయోగపడతాయి. జామ చెట్లు సాధారణంగా మూడు అడుగుల నుండి 20 అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. జామ ఆకులను వస్త్ర పరిశ్రమలో సహజ నల్లరంగుగా ఉపయోగిస్తారు. జామ చెట్టు జీవితకాలం కనీసం 40 సంవత్సరాలు. మన పరిసర ప్రాంతాలలో జామ పండ్లు చాలా చౌక ధరలకే లభిస్తాయి. మనం కూడా మన ఇంటి పరిసరాలలో, వ్యవసాయ క్షేత్రాలలో చెట్లను నాటి వాటి ఫలాలను ఆరగిద్దాం. ఆరోగ్యంగా బతుకుదాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655

# నోబెల్ బహుమతి వస్తుందని ముందే ధీమాగా చెప్పిన సి.వి.రామన్

విజ్ఞాన శాస్త్ర రంగంలో ఆసియా ఖండంలోనే తొలి నోబెల్ బహుమతి గ్రహీత సర్ సి.వి.రామన్ (1988-1970). అలాగే ఆయన తొలి నాన్-వైట్. ఫిజిక్స్ పరిశోధనకు సి.వి. రామన్‌కు 1930లో నోబెల్ రాగా, సాహిత్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్‌కు 1913లో 'గీతాంజలి' రచనకు లభించింది. సివి రామన్ తండ్రి చంద్రశేఖర్ అయ్యర్ మన విశాఖపట్నంలో మిస్సెస్ ఎ.వి.ఎన్. కాలేజీలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ బోధించేవారు. అక్కడ బాల్యం గడిపిన సి.వి. రామన్‌కు తెలుగు కూడా వచ్చు. తన 40 ఏళ్ల వయసులో అంటే 1928 ఫిబ్రవరి 28న ఆయన ఆవిష్కరించిన 'రామన్' ఎఫెక్ట్‌కు రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతినందిస్తూ నోబెల్ బహుమతి వరించింది. సి.వి. రామన్‌కు రాజకీయ నాయకులలో గాంధీజీ అంటే ప్రత్యేకమైన గౌరవం. ఆయన తన సతీమణితో కలిసి 1936లో వార్ధా ఆశ్రమంలో గాంధీజీని కలిసి, అక్కడ రెండు రోజులు పాటు ఉన్నారు. గాంధీజీ మరణించిన సందర్భంలో సి.వి. రామన్ చాలా తల్లడిల్లడమే కాకుండా; తను 1970లో మరణించే దాకా ప్రతి సంవత్సరం గాంధీ మహాత్ముని గురించిన స్మారక ప్రసంగాన్ని చేసేవారు.



సి.వి. రామన్‌కు తనకే నోబెల్ బహుమతి లభిస్తుందని 1928 నుంచే భావించేవారు. ఈ బహుమతిని స్థాపించిన శాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ నోబెల్ జన్మదినం అక్టోబర్ 21కు అన్ని విభాగాల గ్రహీతల పేర్లు ప్రకటించడం ముగిసి, ప్రతి సంవత్సరం వర్ధంతి డిసెంబర్ 10న బహుమతి ప్రదానం జరుగుతుంది. కనుక ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ నెలలో శాస్త్రవేత్తలు చాలా ఆసక్తితో ఈ గ్రహీతల వివరాల కోసం వేచి ఉంటారు. 1928లో ఇంగ్లాండ్‌కు చెందిన ఓవెన్ రిచార్డ్ సన్ (1879-1959)కు 'థర్మియానిక్ ఎమిషన్' ఆవిష్కరణ కుబీ 1929లో శక్తి తరంగంగానూ, కణంగాను ప్రవర్తిస్తుంది అనే భావనను ప్రతిపాదించి క్వాంటమ్ మెకానిక్స్ విభాగం సైద్ధాంతికంగా బలపడడానికి దోహదపడిన ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ డిబ్రోగ్లీ (1892-1987)కు నోబెల్ బహుమతులు ప్రకటించారు. తనకు నమ్మకంగా వస్తుందని విశ్వసించిన సి.వి.రామన్ ఈ ప్రకటన కోసం వార్తా పత్రికలను క్రమం తప్పకుండా చూసేవారు. 1930లో తనకు నోబెల్ బహుమతి వస్తుందని జులై నెలలోనే స్వీడన్‌కు టికెట్లు కొనేశారు, ఒక్కడికే కాదు భార్యకు కూడా కలిపి. తన పరిశోధన మీద ఆయనకు అంత నమ్మకం మరి. ఆయన భావించినట్టే ఆ సంవత్సరం నోబెల్ బహుమతి లభించింది. అలా ఆలస్యంగా 1930లో రావడమే మంచిదయిందని, అదే 1928లో అయితే బహుమతిని పంచుకోవలసి ఉండేదని ఆయన తర్వాత కాలంలో వివరించడం విశేషం.

నోబెల్ బహుమతిలో మరో ప్రధాన ఆకర్షణ గ్రహీతకు లభించే ఆర్థిక సదుపాయం. స్వీడన్ మారకం క్రోనార్ల ప్రకారం ప్రస్తుతం నోబెల్ బహుమతి పైకం 11 మిలియన్లు ఉంటుంది. అమెరికా పౌండ్ల ప్రకారం చెప్పాలంటే అది సుమారు ఒక మిలియన్ మించి అవుతుందిపుడు. 'స్కాటరింగ్ ఆఫ్ లైట్, రామన్ ఎఫెక్ట్' ఆవిష్కరించి నందులకు సి.వి. రామన్‌కు అప్పట్లో ఒక మిలియన్ స్వీడన్ నార్లు లభించాయి. ఈ ధనంతో ఒక పరిశోధనా సంస్థ స్థాపించాలని రామన్ భావించారు. తొలుత మొత్తాన్ని బెంగళూరులోని ఒక ప్రైవేటు బ్యాంకులో భద్రపరిచారు. అది మైసూరు మహారాజు నుంచి ధర్మ రత్నాకర అనే బిరుదు పొందిన గోపాలరావు అనే వ్యక్తి నిర్వహించే ప్రైవేటు బ్యాంకు. ధర్మ కార్యాలు చేశారని ప్రచారం మొదట ఉండేది. తర్వాత కాలంలో అతను మైసూరు రాజభవనంలోని ఎన్నో వస్తువులను గల్లంతు చేయడంతో పాటు, ఎంతో మందికి మోసం చేశారనే కీర్తి మూట గట్టుకున్నారు. ఆ మోసపోయిన వారి జాబితాలో కూడా మన నోబెల్ బహుమతి గ్రహీత సి.వి.రామన్ కూడా ఉన్నారు. కనుకనే గోపాలరావు మోసం చేసే నైపుణ్యానికి కూడా నోబెల్ బహుమతి ఇవ్వాలని చమత్కరించేవారు.

కలకత్తా వదిలి 1933లో బెంగళూరులోని టాటా ఇన్‌స్టిట్యూట్ (అదే నేడు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్)లో డైరెక్టర్‌గా చేరారు. ఆ సంస్థకు వీరే డైరెక్టర్ పదవిని అధిరోహించిన తొలి భారతీయుడు. అక్కడి నుంచి వీరు పదవీ విరమణ చేసిన తర్వాత 1948లో పరిశోధనల కోసం బెంగళూరులో 'రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' అనే గొప్ప సంస్థను ప్రారంభించారు. ఇది నేడు అంతర్జాతీయంగా ఖ్యాతి, గుర్తింపు పొందిన సంస్థ.

- డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు,
ప్రముఖ సైన్స్ రచయిత,
m : 9440732 392


కథ


# పులి కూన గెంతులు




ఓ రోజు అడవిలో చల్లటి గాలులు వీచసాగాయి. జంతువులన్నీ ఆనందంతో స్థావరాలను వదిలి బయటకు వచ్చాయి. పిల్ల జంతువుల సంగతి చెప్పనక్కర్లేదు. అవి సందడి చేస్తూ అటూఇటూ పరుగులు తీస్తున్నాయి. ఆ సమయంలో ఒక జింకపిల్ల చెంగుచెంగున గెంతులేయ సాగింది. దాని గెంతులు అన్ని జంతువులను ఆకర్షిం చాయి. ఇది ఒక పులి కూనకు మరింత నచ్చింది. తల్లి పులి దగ్గరకు వెళ్లింది. అమ్మా! నాకు కూడా జింక పిల్లలా గెంతులు వేయాలని ఉందని అంది. దానికి తల్లి పులి నీకు ఇదేం ఆలోచన. ఈ మాటలు ఎవరైనా విన్నా .. గెంతులు చూసినా నవ్వుకుంటారు అన్నది. ఎందుకమ్మా! నవ్వేది. అమాయకంగా అడిగింది పులికూన. మన ఇంటా వంటా ఎక్కడైనా గెంతులు వేయటం ఉందా! మనం గెంతులు కాదు పరుగులు తీయాలి. అదే మన జాతి లక్షణం. నీ ఆలోచన మానుకో అన్నది తల్లి. అమ్మా! జింక పిల్ల గెంతులు నాకు నచ్చాయి. నేను కూడా అలా ప్రయత్నిస్తాను అన్నది కూన. నేను చెప్పింది వింటే నీకే మంచిది. లేకపోతే ఇబ్బంది పడతావు అన్నది తల్లి పులి. ఒక్కసారి జింకపిల్ల వద్దకు వెళ్లి గమనిస్తా. తర్వాత నేను కూడా వేస్తా అన్నది కూన. నేను చెప్పింది ఎప్పుడు విన్నావు? జాగ్రత్తగా ఆడుకో అన్నది పులి. తల్లి అంగీకరించటంతో కూన జింకపిల్ల వద్దకు వెళ్లింది. దాంతో నువ్వు గెంతులు వేస్తుంటే బాగుంది. నాకూ నేర్పించవూ అని అడిగింది. దానికి జింకపిల్ల నాకు నేర్పటం చేతకాదు. మా అమ్మ గెంతులు వేయటం చూసి నేర్చుకున్నాను. నువ్వు కూడా అలాగే నేర్చుకో అన్నది. దానికి పులి కూన అంగీకరించింది. జింకపిల్ల గెంతులు వేస్తుంటే పులి కూన అనుకరించింది. మెల్లగా కాళ్లు పైకి కిందకు లేపుతూ గెంతులు వేయసాగింది. అలా సందడి చేయటం పులి కూనకు ఆనందం కలిగించింది. ఇంతలో పులి కూన అమ్మా! అంటూ కింద పడింది. తల్లి ఆందోళనతో పరుగున కూన వద్దకు చేరింది. దగ్గరకు తీసుకుని ఏమైంది? అని ప్రశ్నించింది. కాలు నొప్పిగా ఉంది. కదల్చలేక పోతున్నాను అన్నది. పులి వైద్యం చేసే ఎలుగుబంటిని పిలిచింది. ఎలుగు కూన కాలు పరిశీలించి బెణికింది. రెండు రోజుల్లో తగ్గిపోతుంది అన్నది. తల్లి పులి కూనతో గెంతులు వేస్తానని ఇంతవరకు తెచ్చుకున్నావు. ఎవరు చేసే పని వారే చేయాలి. నా మాట వినుంటే ఈ పరిస్థితి రాదంటూ మెల్లగా స్థావరానికి తీసుకెళ్లింది. అమ్మ మాట వినాలని కూన మనసులో గట్టిగా నిర్ణయించుకుంది.

– తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర
బిటెక్ (ఈసీఇ) ప్రథమ సంవత్సరం,
ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల, ఖమ్మం.
m : 9492309100


ఆగస్ట్ 15
రచన:
జుగాష్విలి
బొమ్మలు:
గోపి : తాతయ్యా! ఆగస్ట్ 15 జెండా పండగ కదా మా స్కూల్లో ఎస్సే రౌటింగ్ డిబేటింగ్ కాంపిటేషన్స్ ఉన్నాయి.
తాతయ్య : ఓ గుడ్... రెండిట్లో పార్టిసిపేట్ చేయి... బాగా ప్రిపేర్ కావాలి.
గోపి : ఆ రోజు స్వాతంత్ర్య దినోత్సవం అనే తెలుసు. వివరాలు చెప్పు తాతయ్య.
తాతయ్య : వ్యాపారం కోసం వచ్చిన బ్రిటీష్ వాళ్లు క్రమంగా దేశాన్ని తమ పాలనలోకి తెచ్చుకున్నారు. మన దేశ సంపదను తమ దేశానికి తరలించుకుపోయారు.
గోపి : బ్రిటన్ చిన్న దేశం కదా ఇంత పెద్ద దేశాన్ని ఎలా ఆక్రమించారు.
తాతయ్య : మన దేశంలో అనేక రాజ్యాలుండేవి. రాజ్యాల మధ్య యుద్ధాలను ఆసరాగా తీసుకొని ఒకో రాజ్యాన్ని ఆక్రమించారు.
గోపి : మన దేశాన్ని బ్రిటిష్ వారు అభివృద్ధి చేసారట.
తాతయ్య : అన్నీ వాళ్ళ ప్రయోజనాల కోసం. ముడిసరుకులున్నాయి. చౌకగా దొరికే శ్రామికులున్నారు కనుక ఫ్యాక్టరీలు, సరుకు రవాణా కోసం రోడ్లు, రైళ్లు వంటి రవాణా, పరిపాలన కోసం విద్యాధికులైన అధికారుల కోసం విద్యను అభివృద్ధి చేశారు.
గోపి : మనకు ఉపయోగమేగా తాతయ్య.
తాతయ్య : అవును. కాని ఆ అభివృద్ధి మన భవిష్యత్తుకు ఎంత ఉపయోగపడుతుందో తెలుసుకోవాలి.


గోపి : బ్రిటిష్ వాళ్ళు ఎలా వెళ్ళిపోయారు.
తాతయ్య : స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం నినాదాలుగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య కాంక్ష పెరిగిపోయింది. వలస దేశాలన్నీ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నాయి.
గోపి : మన జాతీయ ఉద్యమం గురించి చెప్పు తాతయ్య.
తాతయ్య : సిపాయిల తిరుగుబాటు, స్వదేశీ వస్తు బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి అనేక రూపాల్లో ఉద్యమాలు సాగాయి. గాంధీ శాంతియుత పద్ధతులతో పోరాడారు.
గోపి : భగత్‌సింగ్, చంద్రశేఖర్ అజాద్, సుఖ్‌దేవ్‌లు ఎవరు తాతయ్య.
తాతయ్య : వాళ్ళు దేశభక్తులు. జలియన్ వాలాబాగ్ దుర్మార్గుడు డయ్యర్‌ను వీళ్ళు కాల్చి చంపారు. వీరిని బ్రిటిష్ వాళ్ళు ఉరి తీసారు. మన అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ కూడా స్వాతంత్ర్య ఉద్యమ వీరులే.
తాతయ్య : సరే! ఇప్పుడు నేను అడుగుతాను. మన జాతీయ గీతం జనగణమన ఎవరు రాసారు. మన మువ్వెన్నల జెండా రూపకర్త ఎవరో తెలుసా?
గోపి: జనగణమన రవీంద్రనాథ్ ఠాగూర్ రాసారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య.
తాతయ్య : గుడ్... గోపీ! ఈ సమాచారం మాత్రమే చాలదు. మీ స్కూల్లో గ్రంథాలయానికి కానీ, ఊళ్లో గ్రంథాలయానికీ వెళ్ళి పుస్తకాలు చదువు.
గోపి : అలాగే తాతయ్య! చదువుతాను. కొత్త విషయాలు తెలుసుకుంటాను.




# అట్టాడ చరణ్‌కు
## ఆసియన్ వేదికపై కాంస్య పతకం గౌరవం

థాయిలాండ్‌లో నిర్వహించిన ఆసియన్ అండర్-16 వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు మూడో స్థానం. థాయిలాండ్‌లో జూలై 12 నుండి 19వ తేదీ వరకు జరిగిన ప్రతిష్టాత్మక 2వ ఆసియన్ అండర్-16 (పురుషుల) వాలీబాల్ ఛాంపియన్‌షిప్ - 2025 పోటీల్లో భారత జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. త్రుటిలో ఫైనల్ బెర్త్ కోల్పోయినప్పటికీ, భారత జట్టు ఆకర్షణీయమైన ప్రదర్శనతో మూడవ స్థానంలో నిలిచింది. ఈ విజయంలో ముఖ్యపాత్ర పోషించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పలాస మండలం అంతరకుడ్డ గ్రామానికి చెందిన యువ వాలీబాల్ క్రీడాకారుడు అట్టాడ చరణ్.

భారత జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన చరణ్ ఆటతీరును ఇండియన్ వాలీబాల్ ఫెడరేషన్‌తో పాటు జట్టు యాజమాన్యం ప్రత్యేకంగా మెచ్చుకుంది. ఈ టోర్నమెంట్‌కు ముందు బెంగళూరులో జూలై 10వ తేదీ వరకు జరిగిన ఎన్.ఎస్.ఎస్.సి. అకాడమీ శిక్షణా శిబిరంలో చరణ్ తన క్రమశిక్షణ, నైపుణ్యం, మరియు పోటీపటిమతో సెలెక్షన్ కమిటీని ప్రభావితం చేశాడు.

చరణ్ తల్లిదండ్రులు అట్టాడ కమలానాదమ్, దేవి, వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. విశాఖ పట్నంలోని అక్కయ్యపాలెం సాయ్ స్పోర్ట్స్ స్కూల్/హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి పూర్తి చేసి, ఇంటర్మీడియట్‌కు అడుగు పెట్టనున్నాడు. అతని అన్నయ్య భార్గవ్, ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు.

చరణ్ మాట్లాడుతూ, "నా విజయానికి మావయ్య రవి, కోచ్ సత్యనారాయణ గారి ప్రోత్సాహమే ప్రధాన కారణాలు. వారిద్దరి మార్గదర్శకత్వంతోనే ఈ స్థాయికి చేరగలిగాను" అని పేర్కొన్నాడు. 2025లో ఢిల్లీ వేదికగా జరిగిన సీబీఎస్సీ నేషనల్ వాలీబాల్ స్కూల్ గేమ్స్‌లో కూడా చరణ్ కాంస్య పతకం సాధించాడు. 2024లో జార్ఖండ్‌లో జరిగిన నేషనల్ పోటీల్లోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి తన సత్తా చాటాడు. "భారత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం నా జీవిత లక్ష్యం. సీనియర్ నేషనల్స్ ఆడి దేశం తరపున ఆడేందుకు నిత్యం శ్రమిస్తున్నాను," - అట్టాడ చరణ్, వాలీబాల్ క్రీడాకారుడు.

**- బాలచెలిమి డెస్క్**

# దోమ పగ

ఒక దట్టమైన అడవిలో ఏనుగులు, జింకలు, పక్షులు, ఇతర జంతువులు సంతోషంగా కలిసిమెలిసి జీవించేవి. ఆ అడవికి ఏనుగు రాజు. అది చాలా దయాగుణం కలది, మరియు బలమైనది. ఎప్పుడూ ఇతరులకు సహాయం చేయడానికి ముందుండేది. అదే అడవిలో ఒక దోమ కూడా ఉండేది. అది చాలా నీచబుద్ధి కలది, మరియు చిన్నచిన్న విషయాలకే పగతో రగిలిపోయేది.

ఏనుగు ప్రతిరోజూ ఆహారం కోసం అడవిలో తిరిగి అలసిపోయేది. సేద తీరడం కోసం నీటి మడుగు పక్కనే ఉన్న ఒక విశాలమైన పెద్ద చెట్టు కిందకు చేరేది. ఆ చెట్టు ఎన్నో పక్షులకు, చిన్న జంతువులకు ఆశ్రయం కల్పించేది. దాని కొమ్మలపై పక్షులు గూళ్ళు కట్టుకొని నివసించేవి.

ఒకరోజు, కొండయ్య అనే కట్టెలు కొట్టేవాడు అడవిలోకి వచ్చాడు. అతనికి డబ్బు సంపాదించాలనే యావ తప్ప వేరే ధ్యాస ఉండేది కాదు. అతను ఆ పెద్ద చెట్టును చూసి, 'ఈ చెట్టును నరికితే నాకు నెల వరకూ కట్టెల కోసం వెతకాల్సిన అవసరం లేదు. అంతేకాదు, దీని బలమైన కాండంతో ఇంటికి అవసరమైన కలప, తలుపులు, కిటికీలు తయారు చేయించి, అంగడిలో అమ్మి మరింత డబ్బు సంపాదించవచ్చు' అనుకున్నాడు.

ఆలోచన రావడమే ఆలస్యం, తన వెంట తెచ్చుకున్న పదునైన గొడ్డలితో చెట్టును నరకడం మొదలుపెట్టాడు.

కొండయ్య గొడ్డలి దెబ్బలకు చెట్టు బలంగా ఊగడంతో, గూళ్ళలోని పక్షులు భయంతో అరుస్తూ గాలిలోకి ఎగిరిపోయాయి. వాటి అరుపులతో అడవిలో అలజడి ఏర్పడింది.

అదే చెట్టు పైన ఉన్న దోమ నిద్రలేచింది. నిద్రలేచిన వెంటనే దానికి విపరీతమైన కోపం వచ్చింది. తన చిన్న రెక్కలను ఆడిస్తూ కొండయ్య వైపు దూసుకువచ్చింది.

పక్షుల అరుపులతో, జంతువుల పరుగులతో ఆ ప్రాంతమంతా గందరగోళంగా మారింది. అడవిలో మేత కోసం దూరం వెళ్ళిన ఏనుగుకు ఈ శబ్దం వినిపించింది. అడవిలో ఏదో ప్రమాదం జరుగుతోందని అనుమానించి, అది వేగంగా చెట్టు దగ్గరకు చేరుకుంది. అక్కడ జరుగుతున్న సంఘటనను చూసి కోపంతో రగిలి పోయింది. ఆ చెట్టు ఎన్నో జీవులకు ఆశ్రయం ఇస్తుందని ఏనుగుకు తెలుసు. వెంటనే కొండయ్య మీదకు దాడికి దిగింది. ఏనుగును అంత కోపంగా చూసిన కొండయ్యకు గుండె జారిపోయినంత పనైంది. చేతిలోని గొడ్డలిని విసిరేసి, తన ప్రాణాలను కాపాడు



కోవడానికి పరుగు లంకించుకున్నాడు.

కొండయ్యను ఏనుగు కొంతదూరం తరిమికొట్టింది. ఆ తర్వాత, "ఇతనికి గుణపాఠం నేర్పాను, ఇక ఈ చెట్టును నరికే సాహసం చేయడు" అని భావించి, వెనుదిరిగి చెట్టు కిందకు చేరింది. ఏనుగుకు ఉన్నత మనస్సు ఉంది. దాని కోపం నీటిపై రాసిన రాతలా క్షణంలో మాయమైంది.

కానీ, దోమ మాత్రం కొండయ్యను వదలకుండా వెంటాడుతూనే ఉంది. కొండయ్య పారిపోతుంటే, అది తన వెగటైన శబ్దంతో అతని చుట్టూ తిరుగుతూ, విసిగిస్తోంది. కొండయ్య దోమను చేతితో విదిలిస్తూనే పరుగెత్తుతున్నాడు. ఏనుగు వెనుదిరిగి వెళ్ళిపోయిందని గమనించిన కొండయ్య పరుగు ఆపి ఊపిరి పీల్చుకున్నాడు.

అయితే దోమది నీచమైన మనసుకదా! కొండయ్య ముఖం పైన వాలింది. కొండయ్య చేతితో విదిలించాడు. అలా విదిలిస్తూనే ఉన్నాడు. దోమ వదలకుండా మళ్ళీ మళ్ళీ వాలుతూ, చిరాకు కలిగిస్తూనే ఉంది. అది చిన్న విషయానికి కూడా ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తోంది. చివరికి, అది కొండయ్య చేతి మీద వాలి, నొప్పి తెలియకుండా రక్తం పీల్చడం మొదలు పెట్టింది. కొండయ్య ఓపిక పట్టి, విసుగు చెంది, ఆ దోమ మీద ఒక్క చరుపు చరిచాడు. ఒక్క క్షణంలోనే దోమ ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

కొండయ్య, తన చేతిలో చచ్చిపడి ఉన్న దోమను చూశాడు. అతని కళ్ళు దోమను, ఏనుగును, అప్పుడు జరిగిన సంఘటనను ఒక్కసారిగా గుర్తు చేసుకున్నాయి.

"చూశావా దోమా! నేను చేసిన తప్పుకు ఏనుగు కోపం కొన్ని క్షణాలే ఉంది, అది నన్ను వదిలేసింది. కానీ నీకు కలిగిన చిన్న కోపం, ఆ పగ ఎంత దూరం తీసుకు వెళ్ళింది? చివరికి నీ ప్రాణాలనే తీసింది. అవును, ఉన్నత మనస్సు గలవారి కోపం నీటిపై రాసిన రాత లాంటిది, అది క్షణికం మాత్రమే. కానీ నీచ మనస్సు గలవారి కోపం పదునైన కత్తి లాంటిది, అది వారిని కూడా నాశనం చేస్తుంది. చిన్న విషయానికి ప్రతీకారం తీర్చుకోవాలని చూసేవారు చివరికి వారికే హాని చేసుకుంటారు" అని తనలో తనే గట్టిగా అనుకున్నాడు.

ఆ రోజు నుండి కొండయ్య అడవిలోకి వచ్చి చెట్లను నరకడం మానేశాడు. అతడు తన తప్పును తెలుసుకుని, ప్రశాంతమైన జీవితాన్ని గడిపాడు.


– డా. పోతగాని సత్యనారాయణ
ఖమ్మం,
m : 9182531202


శతకం

# వేమన పద్యాలు

**చాకి కోకలుతికి చీకాకు పడజేసి**
**మైలతీసి లెస్స మడచినట్లు**
**బుద్ధిచెప్పువాడు గ్రుద్దిన మేలయా!**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : బట్టలకంటిన మురికి బాగా ఉతికి చాకివాడు చక్కగా ముడుపులు కడతాడు. అట్లే బుద్ధి నేర్పే అయ్య శిష్యుల్ని శిక్షిస్తాడు, మంచిదారిలో పెడతాడు. మనసుకు అంటిన మురికి వదిలించు కోవాలి. దానికి గురువులు కావాలి. గురువులు చెప్పిన రీతి కష్టంగా ఉన్న ఇష్టంగా సాధన చేస్తే మంచి ఫలితం వస్తుంది.

**కనకమృగము భువినికద్దు, లేదనలేక**
**తరుణి విడిచిపోయె దాశరథియు**
**దైవమైన ధనము తలచుచుండునుగాదె**
**విశ్వదాభిరామ వినురవేమ!**


తాత్పర్యం : భార్య కోరినదని మంచి చెడు విచారింపక మాయలేడి వెంట పరుగులిడిన రాముడు దేవుడెలాగయ్యాడు.



కథ

# ఇసుక తుఫాను

## కయ్యుం తంగ్రీకుల్‌యెవ్



అనగనగా ఒక ఊరిలో ఓ ముసలి గొర్రెల కాపరి ఉండేవాడు. అతనికి విశ్వాస పాత్రురాలైన కుక్క ఉండేది. దాని పేరు 'అక్‌బాయ్'. అది గొర్రెల మందను కాపలా కాసేది.

ముసలి గొర్రెల కాపరి వద్ద ఓ తుపాకీ వుండేది. దాంతో తోడేళ్ళను వేటాడి, తన గొర్రెలను కాపాడుకొనేవాడు.

ఓ రోజు గొర్రెలను మేపడానికి 'రెండు పాప్లార్'లు అనే పేరున్న ఓ ఇసుక మైదానానికి వెళ్ళాడు ముసలయ్య. తన కుక్కను కూడా వెంట తీసుకుపోయాడు. గొర్రెలు ఇసుక మైదానంలో గడ్డి మేస్తున్నాయి. తాతయ్య, కుక్క వీపు నిమురుతూ గొర్రెలమందకు కాపలా కాస్తున్నాడు. ఇంతలో సాయంత్రమైంది. ఉన్నట్టుండి ఇసుక తుఫాను మొదలయ్యింది. దుమ్ము పెద్ద ఎత్తున గాల్లోకి లేచింది. గొర్రెలమంద బెదిరింది. దాన్ని కాపాడడానికి ముసలయ్య, కుక్క ప్రయత్నించారు. కానీ దుమ్ము తాకిడి ఎక్కువగా ఉండడంవల్ల ఒకరికి ఇంకొకరు కనిపించలేదు.

తెల్లవారింది. ఇసుక దిబ్బలోంచి మెల్లగా పైకి లేచాడు ముసలయ్య.

కుక్క కనపడటం లేదు. గొర్రెలమందా మాయం అయ్యింది. ఆ పక్కనే తెగిన చిన్న గంట కనిపించింది. అది గొర్రెల నాయకుడు అయిన పెద్ద గొర్రె మెడలోని చిన్న గంట. గంట తెగిందంటే పెద్ద ప్రమాదం జరిగినట్టే. ఇక గొర్రెల జాడ కనిపెట్టడం చాలా కష్టం.

ముసలయ్య పరిగెత్తుకొంటూ వెళ్ళి, జరిగింది చెప్పి, ఇరుగు పొరుగు వారిని తోడు తీసుకుని గొర్రెలమందను వెతకటానికి బయలుదేరాడు. అలా వాళ్ళు కొన్ని కిలోమీటర్లు పోయిన తరువాత పాతబడిన ఎండిపోయిన బావిలో గొర్రెల మంద కనిపించింది. వాటికి కుక్క కాపలా కాస్తోంది. అది యజమాని పట్ల విశ్వాసంతో నాలుగు రోజులు తిండి, నీరూ లేకున్నా గొర్రెలమందను కాపలా కాసింది. విశ్వాసం అంటే అది. ముసలయ్య గొర్రెలను లెక్కపెట్టాడు. అన్ని గొర్రెలు ఉన్నాయి. ముసలి గొర్రెల కాపరి తన కుక్కను కౌగిలించుకున్నాడు.


స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల
m : 81792 73971


ఇంగ్లీష్ : ది సాండ్ స్టోర్మ్
రచయిత : కయ్యుం తంగ్రీకుల్‌యెవ్
ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డన్

# కాకి – పాము కథ



పూర్వం ఒక మర్రిచెట్టు మీద ఒక కాకి గూడు కట్టుకుని నివసించేది. అదే చెట్టు క్రింద పుట్టలో త్రాచుపాము ఉండేది. కాకి ఆహారం కోసం బయటకు పోయిన సమయం కనిపెట్టి, త్రాచుపాము చెట్టు ఎక్కి, కాకి పెట్టిన గ్రుడ్లన్నీ తినివేసేది. తిరిగివచ్చిన కాకి పాము చేసిన దుర్మార్గాన్ని తెలుసుకుని ఎంతో బాధపడేది. ఇలా కొన్నిసార్లు జరిగింది. ఆ పాము పీడ ఎలా విరగడ చేసుకోవాలా అని కాకి తీవ్రంగా ఆలోచించింది.

కాకికి రాజుగారి ఉద్యానవన సరోవరంలో అంతఃపుర స్త్రీలు జలకాలాడడం గుర్తుకొచ్చింది. వారు ఆ సమయంలో తమ నగలు ఒడ్డున పెట్టడం కూడా గుర్తుకు వచ్చింది. అప్పుడు దానికి ఒక ఉపాయం తట్టింది.

కాకి వెంటనే అక్కడకు చేరుకుని, ఒక రత్నహారాన్ని తన ముక్కున కరచుకుని వారికి కనిపించేలా తక్కువ ఎత్తులో ఎగురసాగింది. అంతఃపుర స్త్రీల కేకలు విన్న రాజసేవకులు కాకిని అనుసరించి పరుగెత్తసాగారు. కాకి మెల్లగా ఎగురుకుంటూ రత్నహారాన్ని తెచ్చి పాము పుట్టలో జారవిడిచింది. హారం కోసం రాజభటులు పుట్టను త్రవ్వగా పాము బుసలుకొడుతూ బయటకు వచ్చింది. రాజభటులు పామును చంపి హారం తీసుకుపోయారు. ఆ విధంగా తన బుద్ధి కుశలతతో కాకి పాము పీడను తొలగించుకుంది.

**నీతి : ఉపాయంతో ఎటువంటి కష్టాన్నైనా తప్పించుకోవచ్చు.**

సేకరణ : అమరావతి





# కొబ్బరి మిఠాయి



కొబ్బరి మిఠాయి తెప్పిస్తా
నీకూ ఒకటి ఇప్పిస్తా
కొబ్బరి బెల్లం తెప్పిస్తా
నీకూ కొంతా ఇప్పిస్తా
కథలూ... పాటలు వినిపిస్తే
అంతా నీకే ఇప్పిస్తా! ఇంకా ఎన్నో తెప్పిస్తా!

– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105



# తొలి సామ్రాట్టులు శాతవాహనులు

భారత దేశంలోని దక్కను ప్రాంతాన్ని, దక్షిణ భారతదేశాన్ని పరిపాలించిన మొట్టమొదటి చారిత్రక 'సామ్రాజ్యం' శాతవాహనులది. నిర్దిష్టంగా తెలుస్తున్న తెలంగాణ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చరిత్ర వీరితోనే ప్రారంభమవుతుంది. అంతటి ప్రాముఖ్యం కలిగిన వీరు ఎవరు అనే ప్రశ్నకి సమాధానం కింది విషయాల నేపథ్యంలో లభిస్తుంది.

### జన్మస్థానం:

బ్రాహ్మీ లిపిలో ఉన్న ప్రాకృత భాషా శిలా శాసనాలు శాతవాహనులను 'సాతవాహన' వంశానికి చెందినవారిగా పేర్కొంటున్నాయి. 'సాతవాహన' సంస్కృత రూపంగా పురాణాల్లో 'శాతవాహన' అనే పదం కనిపిస్తుంది. 'శాతకర్ణిలు' అనే మాట కూడా పురాణాల్లో కన్పిస్తుంది. అయితే వారి నాణేలు వారిని 'సదవాహనులు,' 'సాదవాహనులు' అని కూడా పేర్కొంటున్నాయి. హేమచంద్రుడు అనే వ్యాకరణవేత్త వారిని 'శాలివాహనులు' అని పేర్కొన్నాడు. పురాణాలు శాతవాహనులను 'ఆంధ్రులు,' 'ఆంధ్ర జాతీయులు,' 'ఆంధ్ర భృత్యులు' అని పేర్కొంటున్నాయి. 'ఆంధ్ర' శబ్దం మొదటిసారిగా రుగ్వేద సంబంధ 'ఐతరేయ బ్రాహ్మణం' (క్రీ.పూ. 8వ శతాబ్దం)లో కన్పిస్తుంది. 'ఆంధ్రశ్చబహువః' అని మహాభారతం పేర్కొనడాన్ని బట్టి ఆంధ్రులు ఎందరో ఉన్నారని అర్థమవుతుంది.

అయితే మెగస్తనీస్ (క్రీ.పూ. 4వ శతాబ్దం) తన రచన 'ఇండికా'లో ఆంధ్రులకు 30 కోట గోడలున్నాయంటూ మౌర్యుల తర్వాత భారతదేశంలోని బలవంతులలో ఆంధ్రులు ఒకరని సూచించాడు. ఇక అశోక మౌర్యుని శాసనాధారంగా ఆంధ్రులు మౌర్య సామ్రాజ్యంలో భాగమని తెలుస్తున్నది. అశోకుని తర్వాత ఆంధ్రులు స్వతంత్రులైనారని, వారిలో సాతవాహన వంశం సామ్రాజ్యాన్ని నిర్మించిందని చెప్పవచ్చు.

### ఎవరు, ఎక్కడివారు:

బి.ఎస్.ఎల్. హనుమంతరావు శాతవాహనులని అశ్వ చిహ్నంగల ఆదిమ జాతివారని భావించారు. వైదిక సాహిత్యం వీరిని (ఆంధ్రులను) అనార్యులని పేర్కొంది.

ఇక ప్రాచీన వాఙ్మయం ఆధారంగా వీరు శూద్రులుగా కూడా గోచరిస్తున్నారు. జైన వాఙ్మయం వీరిని బ్రాహ్మణ పురుషుడు శూద్ర స్త్రీ సంగమ సంతానంగా పేర్కొంటుంది.

అయితే గుణాఢ్యుని 'బృహత్కథ' ఆధారంగా రచించిన 'కథా సరిత్సాగరం' శాతవాహనులను సాత యక్షునికి, బ్రాహ్మణ స్త్రీకి పుట్టిన వంశంగా పేర్కొంటుంది.

గౌతమీ బాలశ్రీ తనను తాను రాజర్షి పత్నిగా పేర్కొనడం వల్ల వీరు క్షత్రియులని, గౌతమీ పుత్ర శాతకర్ణిని 'ఏకబ్రాహ్మణుడు' అని నాసిక్ శాసనం పేర్కొనడం వల్ల వీరు బ్రాహ్మణులని అనడానికి ఆస్కారముంది. వీరి వివాహ సంబంధాల్లో కూడా వర్ణసాంకర్యం కనపడడాన్ని బట్టి శాతవాహనులకు అన్ని వర్ణాలతో సంబంధముందని చెప్పవచ్చు.

అయితే ఎక్కువ మంది చరిత్రకారులు వీరిని బ్రాహ్మణులని భావించగా కొర్లపాటి శ్రీరామమూర్తి 'చరిత్ర చర్చ' అనే పరిశోధిత గ్రంథంలో శాతవాహనులు ఆంధ్రులు, బ్రాహ్మణ మతస్థులు, శూద్ర కులస్థులు, కృషీవల కుటుంబులు అయిన పాలకులు అని సిద్ధాంతీకరించారు.

ఇటీవల ఒక పరిశోధకుడు 'శాతవాహన' పదానికి

కన్నడ భాషలో 'హాలికుడు' అనే అర్థం చెప్పడాన్ని బట్టి, 'శాలివాహనుడు' అంటే తెలుగులో, సంస్కృతంలో (శాలి = వరి) రైతు అనే అర్థం వస్తుంది కాబట్టి శాతవాహనుల మొదటి వృత్తి వ్యవసాయం కావచ్చు. ఇంకా కొందరు పరిశోధకులు వీరిని కుమ్మరి మొదలైన వృత్తులకు చెందినవారిగా నిరూపించేందుకు ప్రయత్నించారు.

శాతవాహన నాణేలను అధ్యయనం చేసి పుచ్ఛా వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి వీరు తెలంగాణలోని కోటిలింగాల, ధూలికట్ట (ధూళికోట), పెద్దబొంకూరు (పెద్దపల్లి జిల్లా), కొండాపూర్ (సంగారెడ్డి జిల్లా) ప్రాంతాల నుంచి పైకి వచ్చినవారని నిర్ధారించారు. ఎవరెన్ని అభిప్రాయాలు వెలిబుచ్చినప్పటికీ అనేక ఆధారాలను సమన్వయంచేసి, శాతవాహనులు తెలంగాణ ప్రాంతం నుండి మహారాష్ట్ర, సౌరాష్ట్ర (గుజరాత్), తూర్పు రాజస్థాన్, దక్షిణ మధ్యప్రదేశ్, ఛత్తీస్ ఘడ్, ఒరిస్సా, కొంకణి (గోవా), కర్నాటక, తమిళనాడు ప్రాంతాలకు విస్తరించారని చెప్పవచ్చు.

### పాలన - కాలం:

శాతవాహనుల శాసనాలు, నాణేలు, 'కథాసరిత్సాగరం' ఆధారంగా 'సాతవాహనుడు' శాతావాహనుల వంశ మూల పురుషుడని తెలుస్తుంది. అయితే పురాణాలు శ్రీముఖుడిని శాతవాహన వంశస్థాపకుడుగా సూచిస్తున్నాయి. ఈ రెండు విధాల ఆధారాలను సమన్వయం చేస్తే సాతవాహనుడు వంశస్థాపకుడు అయినప్పటికీ శ్రీముఖుడు స్వతంత్ర పాలనను స్థాపించి, విస్తరించి తన వంశ స్థాపకుడి నామాన్ని తన రాజవంశ నామంగా ప్రసిద్ధం చేశాడని చెప్పవచ్చు. అయితే శాతవాహనులను 'శాతకర్ణిలు' అని కూడా అంటారు. కాబట్టి మొదటి శాతకర్ణియే స్వతంత్ర శాతవాహన వంశస్థాపకుడు అన్నవారు కూడా లేకపోలేదు.

శాతవాహనుల పాలనా కాలాన్ని 300 ఏళ్లని వాయు పురాణం, 456 అని భాగవత, విష్ణు, బ్రహ్మాండ పురాణాలు, 460 అని మత్స్యపురాణం (30 రాజులు) సూచిస్తుండగా, వాటి ఆధారంగా గొర్తి వెంకట్రావు ఆ కాలాన్ని క్రీ.పూ. 271 - క్రీ.శ. 174 గాను, మారేమండ రామారావు క్రీ.పూ. 221 - క్రీ.శ. 218 గాను, బి.ఎస్.ఎల్ హనుమంతరావు క్రీ.పూ. 230 - క్రీ.శ. 225గాను, కోటిలింగాల తవ్వకాలు, శాసనాలు, నాణేలు ఆధారంగా పి.వి. పరబ్రహ్మశాస్త్రి క్రీ.పూ. 80 - క్రీ.శ. 230 గాను సమన్వయం చేశారు. శాస్త్రీయ అధ్యయనమైనందున శాస్త్రి నిర్ధారణనే అంగీకరించవలసి యున్నది.

-డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078

## పొడుపు కథ

చీట్లు చింపు చుండు చిన్న పిల్లడు కాదు
కాసు లడుగు భిక్ష గాడు కాదు
కొట్టుచుండు గంట గుడి పంతులా కాదు
దీని భావ మరసి తెలుపుడోయి

(బస్ కండక్టర్)

తల్లావజల మహేశ్ బాబు
నిజామాబాద్





## బొమ్మలేద్దామా...



బి.రమణి
6వ తరగతి, 11 సంవత్సరాలు, జెనీవా.

కథ

# దురదృష్టవంతుడి అదృష్టం




పూర్వం "శివపురం" అనే గ్రామంలో "కిష్టప్ప" అనే అనాథ యువకుడు ఉండేవాడు కిష్టప్ప కురూపి, అనాకారి, కానీ. సుతిమెత్తని మనసు అమాయకత్వం. చిన్నతనంలోనే తల్లి తండ్రి చనిపోయారు తను మేన మామ ఇంట్లో పెరిగాడు. అత్త రంగమ్మ మాత్రం వాడిని అల్లుడుగా చూసేది కాదు. భర్త పోరుకు తట్టుకోలేక ఇంట్లో ఉండనిచ్చింది. ఆ ఇంట్లో కిష్టప్ప పని వాడి కన్నా హీనం. అతని కంచం వేరు, మంచం వేరు, అతని రూపం చూసి ఎవరూ సఖ్యతగా ఉండేవారు కాదు. రంగమ్మ కూతురుకు మాత్రం కిష్టప్ప అంటే కాస్త సానుభూతి ఉండేది. ఎంతైనా అత్త కొడుకు వరుసకు బావే కదా అని. అప్పుడప్పుడు తల్లి వైఖరిని వ్యతిరేకిస్తూ బావకు మద్దతు పలికేది. అలా కొంతకాలం గడిచింది. కిష్టప్పకు యుక్త వయసు వచ్చింది. పెద్ద వాడయ్యాడు. అతని రూపం అతనికి శత్రువైంది. తను వీధిలో ఎవరికైనా ఎదురుపడితే పలకరించే వారు కాదు. అది కిష్టప్పకు ఇబ్బందిగా అనిపించేది. ఎన్నోసార్లు అద్దంలో ముఖం చూసుకుని బాధపడేవాడు. ఇక ఇంట్లో పరిస్థితి మారిపోయింది రంగమ్మ భర్తతో. "ఇంకా ఎన్నాళ్లు భరిస్తాం చిన్నప్పుడు అంటే ఒక ముద్ద పడేస్తే సరిపోయేది ఇప్పుడు చిన్నపిల్లాడు కాదు. నీ అల్లుడిని ఊరికే మేపడం నావల్ల కాదు ఏదో ఒకటి చేయండి" అన్నది. భర్త "తల్లీ తండ్రి లేనివాడు ఇప్పుడు ఉన్నపళంగా వెళ్ళమంటే ఎక్కడికి వెళ్తాడు? ఏదో ఇంత తిండి పెడితే చాలు పనిలో సాయం చేస్తూ ఉంటాడు కదా! పైగా పరాయి వాడేం కాదు నీకది పుణ్యమే కదా" అని నచ్చచెప్పాడు. కాని! ఆ మాటలు రంగమ్మకు రుచించలేదు. ఎందుకంటే! కిష్టప్ప ఇంట్లో ఉంటే తన కూతురుకు పెళ్లి సంబంధాలు కూడా రావు అనుకుంది. ఎలాగైనా అతడిని శాశ్వతంగా ఇంట్లో నుండి వెళ్ళ గొట్టాలని పథకం ఆలోచించింది.

ఒకరోజు కిష్టప్పతో. "చూడు బాబు! నీ రూపం చూసి అందరూ హేళన చేస్తున్నారు ఎవరూ నీ దగ్గరికి రారు నీతో మాట్లాడటానికి ఇష్టపడరు. నేను చెప్పినట్టు చేస్తే నీ రూపం మారిపోయి అందంగా తయారవుతావు అప్పుడు అందరు నీతో స్నేహం చేస్తుంటారు కూడా. కాబట్టి నువ్వు వెంటనే ఆ కనిపించే ఉత్తర దిశలో ఉన్న కొండను దాటి ఆవల ఉన్న అడవుల్లోకి వెళ్లితే అక్కడ చాలా మంది మునులు, సాధువులు తపస్సు చేసుకుంటూ ఉంటారు వాళ్ళు చాలా మహిమ కలిగి ఉంటారు నువ్వు వారిని కలిసి నీ సమస్యను చెప్పుకుంటే చాలు. వారు నీ రూపం మార్చి చక్కని రూపం వచ్చేలా చేస్తారు" అని చెప్పింది. అడవిలోకి పంపిస్తే అక్కడ ఉండే అడవి మృగాలు అతన్ని చంపి తినేస్తాయి పీడ విరగడ అయిపోతుంది అనుకుంది. కిష్టప్పకు మాత్రం ఆ సలహా చాలా సంతోషాన్నిచ్చింది ఆలస్యం చేయకుండా వెంటనే బయలుదేరి ఆమె చెప్పినట్టుగా కొండను దాటి అడవిలోకి ప్రవేశించాడు అలా కొంచెం దూరం వెళ్ళగానే ఒకచోట చెట్టు కింద ఒక సాధువు విశ్రాంతి తీసుకుంటు ఉండటం కనిపించింది గడ్డాలు మీసాలు

ఉండటం చూసి అత్తయ్య చెప్పింది వీరిగురించే అయ్యుంటుంది అనుకొని సాధువు దగ్గరికి వెళ్లి పాదాలకు నమస్కరించాడు. సాధువు "ఏం కావాలి నాయనా?" అన్నాడు. కిష్టప్ప తన బాధ గురించి చెబుతూ "నేను ఒక అందహీనుడిని నా రూపం నాకు శత్రువు అయింది అమ్మానాన్న లేని వాడిని అందరూ నన్ను చులకనగా చూస్తున్నారు దయచేసి నాకు ఈరూపం పోగొట్టి అందమైన రూపం వచ్చేలా అనుగ్రహించండి". అంటూ కన్నీటి పరియంతరం అయ్యాడు. అంతా విన్నాక కిష్టప్ప అమాయకత్వం చూసి సాధువుకు జాలేసింది తనికి ఏదో ఒకటి చేయాలని నిశ్చ యించుకున్నాడు చిరునవ్వునవ్వి "చూడు నాయనా! మనిషికి ఉండవలసింది అందమైన రూపం కాదు, అందమైన మనసు. ఈ సృష్టిలో ప్రతి జీవికి ఏదో ఒక కళ ఉంటుంది కోకిలను చూసి అందరూ ఇష్టపడేది రూపం చూసి కాదు. దాన్ని స్వరమాధుర్యాన్ని చూసి.. అలాగే ప్రతి మనిషిలోనూ ఏదో ఒక కళ ప్రతిభ అనేది ఉండాలి! గానం, నాట్యం, శిల్పం, ఇలాంటిఏదో ఒకటి ఉంటే చాలు! అది తన చుట్టూ ఉండే నలుగురూ తనను గౌరవించేలా, ప్రేమించేలా చేస్తుంది. అలాంటి ప్రతిభనునీకు నేను కల్పిస్తాను అంతేకానీ! ఇప్పుడు నీవు కోరినట్టు, నీ రూపం మార్చడం అంత తేలిక కాదు. అది సృష్టి రహస్యం కాకపోతే నిన్ను చూసి అసహ్యించుకునే జనం నీ వెంటే ఉండేలా, నువ్వంటే ఇష్టపడేలా చేయగలను. అన్నాడు. దానికి కిష్టప్ప "సరే స్వామి! అలాగైనా చేయండి" అన్నాడు. సాధువు సంచిలో నుంచి ఒక చిన్నవెదురు (వేణువు) తీసి ఇస్తూ" ఇది మహిమ గల వేణువు దీనిని నువ్వు వాయించావంటే చాలు సప్త స్వరాలు పలుకుతాయి ఆ గానానికి పశుపక్షాదులు కూడా తన్మయత్వం చెందుతాయి. ఆ గాన మాధుర్యానికి జనం ఆనంద పరవశం చెందుతారు. నిన్ను కాదన్న వారంతా నీ చుట్టూనే ఉంటారు. నీపాట వింటూ పరవశిస్తారు". అన్నాడు. కిష్టప్ప దాన్ని తీసుకొని మరొకసారి సాధువుకు నమస్కరించి ఇంటిదారి పట్టాడు. అలా అతడు చెట్ల మధ్యలో దారంట నడుస్తూ వేణువు తీసి వాయించాడు అంతే అద్భుతంగా ఆ వేణువు మధురమైన స్వరాలు పలికింది. ప్రకృతి పులకించి పోయింది కిష్టప్ప ఆనందానికి అవధులు లేవు తనను తాను మైమర్చిపోయాడు. ఇప్పుడు అతనికి కొండంత ఆత్మవిశ్వాసం పెరిగింది. అలా వేణువు ఊదుకుంటూనే గ్రామం చేరాడు ఇంకేముంది చూస్తుండగానే జనం అతని చుట్టూ చేరారు ఆ గాన మాధుర్యానికి అందరూ మంత్ర ముగ్ధులయ్యారు. నిన్నటి దాకా అనామకుడిగా ఉన్న కిష్టప్ప ఇంత గొప్ప కళాకారుడుగా మారి వేణు గానాన్ని ఆలపించడం చూసి అందరూ విస్మయం చందారు. విషయం రంగమ్మ దాకా చేరింది ఆమె ఒక క్షణం కంగారు పడ్డది. వీడేంటి! జంతువులు పీక్క తింటాయని అడవికి పంపిస్తే వేణు గానం చేస్తూ తిరిగొచ్చాడు! ఇప్పుడు ఏమిటి చేయడం? అని ఆలోచిస్తుండగానే కిష్టప్ప వేణువు వాయించుకుంటూ నేరుగా ఇంట్లోకి వచ్చి రంగమ్మ పాదాలకి నమస్కరించి " అత్తా! నీ కోరిక ప్రకారం అడవికి వెళ్లి ఒక సాధువును కలిశాను అతడు నాకు ఈ మహిమగల వేణువును ఇచ్చాడు. దీని గాన మాధుర్యానికి జనమంతా నా చుట్టూ చేరుతున్నారు. ఇప్పుడు నేనంటే అందరికీ ఇష్టమే నాకు ఇప్పుడు గర్వంగా ఉంది ఇదంతా నీ దయ వల్లే జరిగింది" అన్నాడు. రంగమ్మకు ఏమనాలో. తోచలేదు. లేని చిరునవ్వు తెచ్చుకుని "అవునవును" అంటూ తన పనిలో లీనమై పోయింది. ఆ రోజు నుండి కిష్టప్ప వేణు గానం వినడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి కూడా వచ్చేవాళ్ళు. అలా కిష్టప్ప వేణు గానం గురించి ఆ దేశాన్ని పాలించే రాజు దాక వెళ్ళింది. వెంటనే రాజు కిష్టప్పని పిలిపించి దర్బార్లో కచేరి పెట్టించాడు. కిష్టప్ప వేణువులో సప్త స్వరాలు పలికించాడు. తన వేణు నాదంతో సభలో అందరిని మంత్రముగ్ధుల్ని చేశాడు రాజు ఆనంద పరవశుడై కిష్టప్పకు ఘనంగా సన్మానం చేసి తన ఆస్థాన కళాకారుడుగా ఉండమన్నాడు. తర్వాత కిష్టప్ప ఇంటికి వచ్చి అత్తమామలతో "నాకు రాజు గారి ఆస్థానంలో కళాకారుడుగా ఉద్యోగం వచ్చింది మీ ఆశీర్వాదం కోసం వచ్చాను" అన్నాడు. రంగమ్మ "అదృష్ట వంతుడివి నీకు కీడు తలపెట్టిన పాపిష్టి దాన్ని క్షమించు నాయనా మనిషికి రూపం ముఖ్యం కాదు మంచి మనసు ఉంటే చాలు! అంతా మంచే జరుగుతుంది. మహ రాజుగారంతటి వారే నీకు సన్మానం చేశాడంటే నేనేపాటి దాన్ని. నా కూతురును నీకిచ్చి పెళ్లి చేసి పాప పరిహారం చేసుకుంటాను" అన్నది. అక్కడే ఉన్న రంగమ్మ కూతురు బావకేసి చూసి సిగ్గు పడింది. మొదటి సారిగా. తన మామయ్య మీసం మెలి వేయటం. చూశాడు కిష్టప్ప.

- బూర్లె నాగేశ్వరావు, కోదాడ
m : 9848419950

కథ

# టీచరు – పిల్లలు



అనగనగా ఒక ఊరి బడిలో స్వాతి అనే టీచర్ ఉండేది. ఆమెకు పిల్లలకు చదువు చెప్పడం, మంచి మాటలు, కథలు చెప్పడం చాలా ఇష్టం. టీచరంటే పిల్లలందరికీ చాలా ఇష్టం. పిల్లలతో మంచిగా ఉంటుంది. పిల్లలు పెద్దలను గౌరవించాలని చెప్పేది. ఇలా కాలం గడుస్తుండగా స్వాతి టీచర్ రిటైర్మెంట్ రోజు వచ్చేసింది. ఆమెకు పిల్లలను విడిచి పెట్టి వెళ్లాలంటే బాధగా ఉంది. పిల్లలకు కూడా చాలా బాధ కలిగింది. కానీ రిటైర్మెంట్ కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగం విడిచి వెళ్లి ఇంటికే పరిమితం అయ్యింది.

ఒకరోజు స్వాతి టీచర్ మార్కెట్‌కు వెళ్తుంది. దారిలో ఒక చెట్టు కింద పిల్లలు ఆడుకుంటూ ఉంటారు. స్వాతికి పిల్లలంటే బోలెడంత ఇష్టం. అందుకే వారి దగ్గరికి వెళ్లి మీరేం చేస్తున్నారని అడిగింది. అందులో ఒక అమ్మాయి మేము ప్రతి రోజూ చెట్టు కింద ఆడుకుంటాం అంది. అయితే మీరందరూ చెట్టు కింద ఆడుకున్న తర్వాత మీకు కొద్ది సేపు చదివిస్తాను, కథలు చెబుతాను అన్నది. కథలనేటప్పటికి పిల్లలకు ఆసక్తి కలిగింది. వారు సరే అన్నారు. ప్రతిరోజు సాయంత్రం బడి వదిలిన తర్వాత వస్తాం అన్నారు.

మరుసటి రోజు సాయంత్రం స్వాతి టీచర్ చెట్టు కిందకు వస్తుంది. అప్పటికే పిల్లలు అక్కడ గుమికూడి ఉండడంతో సంతోషించింది. వారిని తన చుట్టూరా కూర్చోబెట్టుకుని మంచి కథ చెప్పింది. మంచి మాటలు చెప్పడంతో పాటు ఒక మంచి పాట పాడింది. పిల్లలచే పాడించింది. పిల్లలంతా సంతోషంగా ఆ రోజు సాయంత్రం గడిపారు. ఇలాగే ప్రతిరోజూ వస్తామని చెప్పారు. స్వాతి టీచర్ చాలా ఆనందపడింది. చాలా రోజుల తర్వాత మళ్ళీ పిల్లలకు చదువు చెప్పే అవకాశం కలగడం, పిల్లలతో గడిపే అవకాశం కలగడంతో పాత రోజులు గుర్తుకు వచ్చాయి. పిల్లలను ప్రతిరోజూ ఇలాగే చెట్టు వద్దకు రావాలంది. ఇలా పిల్లలు ప్రతిరోజూ చెట్టు వద్దకు రావడం, స్వాతి టీచర్ వారికి పాఠాలు, కథలు, పాటలు చెప్పడం, ఆటలు ఆడటం ఒక అలవాటుగా మారిపోయింది.

ఒకరోజు స్వాతి టీచర్‌కు బాగుండదు. తీవ్రమైన జ్వరంతో బాధపడుతుంది. అందుకే ఆ రోజు చెట్టు వద్దకు వెళ్ళలేదు. పిల్లలు టీచర్ కొరకు చాలా సేపు వేచి ఉన్నారు. కానీ టీచరు రానేలేదు. టీచర్ ఎందుకు రాలేదో తెలుసుకుందామని టీచర్ ఇంటికి వాళ్ళందరూ వెళ్లారు. టీచర్ జ్వరం వచ్చి లేవలేని స్థితిలో ఉండడంతో పిల్లలు బాధ పడ్డారు. టీచర్ ఇంటి వద్ద మరెవరూ లేరు. డాక్టర్ వద్దకు కూడా వెళ్లలేదని టీచర్ చెప్పింది.

పిల్లలు టీచర్ ఇంటి వాకిట్లోకి వచ్చి చర్చించుకున్నారు. టీచర్‌ను డాక్టర్ వద్దకు తీసుకొని వెళ్ళాలని నిర్ణయించారు. తమ వద్ద ఉన్న డబ్బులు సరిపోవని ఇంటికి వెళ్లి తాము దాచుకున్న డబ్బులు తెచ్చారు. టీచర్ ను డాక్టర్‌కు చూపించి మందులు తీసుకొని వచ్చారు. మందులు వేశారు. మరుసటి రోజుకల్లా టీచర్ జ్వరం తగ్గింది. పిల్లలకు తన కృతజ్ఞతలు చెప్పుకొని వైద్యం కోసం ఖర్చు చేసిన డబ్బులు ఇవ్వబోయింది. కానీ పిల్లలందరూ టీచర్‌కు పాదాభి వందనం చేసి, మేమే మీకు రుణపడి ఉంటామన్నారు. మాకు డబ్బులు వద్దన్నారు. ఎందుకంటే ఎలాంటి డబ్బులకు ఆశపడకుంటా ప్రతిరోజూ మాకు మీరు చదువు చెబుతున్నారని అన్నారు. దీనితో స్వాతి టీచర్ కళ్ళవెంట ఆనందభాష్పాలు వచ్చాయి. పిల్లలందరినీ ఒకేసారి తన ఒళ్ళో కూర్చోబెట్టుకుని ముద్దాడింది. ఇలా పిల్లల చదువులు స్వాతి టీచర్ ఆధ్వర్యంలో నిరంతరంగా సాగాయి.

– తల్లెల కీర్తి
9 వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
లక్ష్మీ పూర్, ఆదిలాబాద్ జిల్లా – 504309.
m : 8374916403

**కవిత**



# అక్షర భావాలు

చిట్టి చీమను చూసి
క్రమశిక్షణ నేర్చుకో
పొదుపు విలువను తెలిసి
భద్రంగా వాడుకో

భూమాతను పరికించి
ఓర్పును అలవర్చుకో
నలుగురికి మంచి పంచి
గుండెల్లో నిలిచిపో

పచ్చని చెట్టును గాంచి
ఎదుగుదల కోరుకో
భువిలో వాటిని పెంచి
పుణ్యం కాస్త కట్టుకో

పుస్తకాలు పట్టుకుని
విజ్ఞానం పొందుకో
ప్రతిదినమూ చదువుకుని
ఉన్నత స్థితి చేరుకో

- గద్వాల సోమన్న
m : 9866414580

**బాలచెలిమి క్లబ్**

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ------------------
తండ్రి పేరు : ------------------
పుట్టినతేదీ : ------------------
చిరునామా : ------------------
------------------
------------------
పిన్ : ------------------
హాబీలు : ------------------
మొబైల్ : ------------------
ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com



విజ్ఞాన ఆవిష్కరణ కథలు

# మేఘాలలో విద్యుచ్ఛక్తి



అది వర్షాకాలం. మబ్బులు పట్టాయి. ఉరుములు, మెరుపులు. అటువంటి సమయంలో ఓ పెద్ద మనిషి గాలిపటాన్ని తీసుకొని తన కుమారుడిని వెంట పెట్టుకుని ఊరవతలకు వెళ్ళాడు.

అది మామూలు గాలిపటం కాదు. సిల్కు గుడ్డతో చేసింది. పెద్ద తాడు కట్టాడు. గాలిపటం పైన లోహపు తీగను అమర్చాడు. చేతిలో పట్టుకొనే దగ్గర సిల్కు రిబ్బను కట్టి దానికి తాళాలు వేలాడ తీశాడు. ఆయనేదో ప్రయోగం చేయబోతున్నట్లు ఉన్నది.

మేఘాల్లో విద్యుచ్ఛక్తి ఉన్నదా? లేదా అని. అది 1752 వ సంవత్సరం. ఆయన బెంజిమిన్ ఫ్రాంక్లిన్ అనే విజ్ఞాని. అమెరికా దేశస్థుడు. మేఘాల్లో విద్యుచ్ఛక్తి ఉన్నదనీ. అందుకనే మెరుస్తున్నదనీ ఆయనకు అనుమానం. అది నిరూపించ టానికే ఆ గాలిపటం, ఊరవతలకు చేరుకుని మేఘాల్లోకి గాలిపటాన్ని ఎగుర వేశాడు. అంతలో ఒక మేఘం గాలిపటం దగ్గర కొచ్చింది. వళ్ళంతా కళ్ళు చేసుకొని చూస్తున్నాడు ఫ్రాంక్లిన్. గాలిపటానికి కట్టిన తాటి పీచులు నిక్కబొడుచుకొని ఉండటం కనుపించింది. వెంటనే తాళం గుత్తి పట్టుకున్నాడు.


'అబ్బా!' పెద్ద షాక్ కొట్టింది. వేరే ఎవరన్నా అయితే భయపడే వారే. కాని ఫ్రాంక్లిన్ అలా చేయలేదు. తాను నమ్మిన సత్యాన్ని రుజువు చేయటం కోసం అంత కష్టాన్ని భరించాడు. ఆ కాలంలో విద్యుత్తును 'లేడెన్ జాడీ' అనే పరికరంలో పట్టి నిలువ ఉంచేవారు. ఫ్రాంక్లిన్ కూడా అలాగే జాడీలోకి విద్యుత్తును పట్టాడు. దానితో మేఘాల్లో కూడా విద్యుచ్ఛక్తి ఉంటుందని రుజువు అయింది.

'పిడుగంటే విద్యుచ్ఛక్తి అని తెలిసింది గదా? దానిని భూమికి తెస్తే భవనాలకు మొదలైన వాటికి ప్రమాదం జరగదు కదా?" అనుకున్నాడు ఫ్రాంక్లిన్.

అందుకనే ఓ సాధనం కనిపెట్టాడు. దానినే 'పిడుగు దండం' (లైట్నింగ్ రాడ్) అంటారు. ఇప్పుడు కూడా పిడుగు దండాలు మనం పెద్ద పెద్ద భవనాల పైన చూస్తుంటాం.

– 'బాల కథా సౌరభం' నుండి...

# జబర్ ఫిల్టర్




"వరద రోజుల్లో గోదావరి నీళ్లు మట్టితో కలిసి కాఫీ రంగులో ఉంటే, ఇందుప గింజ అరగతీసి ఆ గంధాన్ని కొద్దిగా ఆ నీళ్లల్లో కలిపే వాళ్లం," అని మా నాయనమ్మ చెబుతూ ఉండేది. కలిపిన కొద్ది నిమిషాలలో ఒండ్రు మట్టి కిందికి దిగిపోయి, తాగడానికి పనికి వచ్చే మంచి నీళ్లు పైకి తేలేవి. ఇందుప గింజ గంధం జిగురుగా ఉండడం వల్ల నీటిలో కలిసి ఉన్న బహు సూక్ష్మమైన మట్టి కణాలు ఒక దానికొకటి అతుక్కుని, బరువెక్కి కిందికి దిగిపోతాయి. అది, ఆనాటి పద్ధతి. ఇప్పటికి మంచినీటి సరఫరా లేని పల్లెలలోనూ, మన్యం ప్రాంతాలలోనూ ఈ పద్ధతినే అవలంబిస్తున్నారు. 8వ శతాబ్దంలో జబర్ అనే రసాయన శాస్త్రజ్ఞుడు అతి సులభమైన ఫిల్టర్ (వడపోత) పద్ధతిని కనిపెట్టాడు. మట్టి కలిసిన నీటిని ఒక గిన్నెలో పోసి, పీట మీద ఎత్తుగా ఉంచాలి. మామూలు నూలు బట్టను నీళ్లల్లో తడిపి, పిండి, ఒక కొస ఈ మట్టి నీటి గిన్నెలోనూ, రెండవ కొస పల్లంలో ఉంచిన మరో గిన్నెలోనూ ఉంచాలి. అంతే.

ఎత్తులో ఉన్న గిన్నెలోని నీటిని నూలుపోగులు "కేశికాక్రియ" ద్వారా పీల్చుకుంటాయి. ఈ విధంగా పీల్చుకున్న నీరు దారపు పోగుల ద్వారా కిందనున్న రెండవ గిన్నెలోకి చుక్కలు చుక్కలుగా పడుతుంది. రెండవ గిన్నెలోని నీటి మట్టం మొదటి గిన్నెలోని నీటిమట్టం కన్నా కిందుగా ఉన్నంతసేపూ మొదటి గిన్నెలో నుండి రెండవ గిన్నెలోకి నిర్మలమైన నీరు చేరుకుంటూ ఉంటుంది. ద్రవంలో కరగకుండా ఉన్న కణాలను నూలుపోగులు పీల్చుకోవు. కాబట్టి అవి మొదటి గిన్నెలోనే మిగిలిపోతాయి. రెండవ గిన్నెలోకి ఆ కణాలు లేని ద్రవం చేరుకుంటుంది. కాని, ద్రవంలో కరిగిపోయిన లవణాలు వగైరా మాత్రం రెండవ గిన్నెలోకి కూడా వచ్చేస్తాయి. కాబట్టి ఈ జబర్ ఫిల్టర్ ఉప్పు నీటిలోని ఉప్పును వేరు చేయలేదు.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి

కథ

# మోసానికి ప్రతిఫలం



ఒక అడవిలో ఒక పులి ఉండేది. దానికి ఎప్పటి నుండో కోతి మాంసం తినాలనే కోరిక ఉండేది. పులికి చిక్కకుండా కోతులు ఒక చెట్టు పైనుండి మరో చెట్టుపైకి గెంతుకుంటూ పారిపోయేవి. దాంతో ఎంత ప్రయత్నించినా కోతి మాంసం రుచి చూడాలన్న పులి కోరిక నెరవేరలేదు. ఒక రోజు ఒక చెట్టు పైన కొన్ని కోతులు ఉండడం గమనించింది పులి. అప్పటికప్పుడు దానికి ఒక ఉపాయం తట్టింది. అమాయకంగా ఉన్న ఒక కోతిని ఉద్దేశించి, “కోతి బావ! కోతి బావ!! నా వీపుకి ముల్లు గుచ్చుకుంది. నీ చేతులతో ఆ ముల్లును తీసి నాకు సహాయం చేయగలవా?” అని దీనంగా అడిగింది. “అమ్మో! నువ్వు క్రూర జంతువువి. నేను నీ చేతికి చిక్కితే నువ్వు నన్ను వదిలి పెడతావా ఏమిటి?” అంటూ ప్రశ్నించింది కోతి. “నేను ఇప్పుడే జింక మాంసాన్ని పుష్టిగా తిన్నాను. ఇప్పుడు నాకు ఆకలిగా లేదు. కనుక నేను నిన్నేమీ చేయను.” అంటూ కోతిని నమ్మబలికింది.

పులి మాటలు నమ్మిన కోతి దాని వీపుపై ఉన్న ముళ్ళు తీయడానికి దగ్గరకు వచ్చింది. కోతి దగ్గరకు రాగానే దానిని చటుక్కున పట్టుకోబోయింది పులి. అప్రమత్తంగా ఉన్న కోతి ఒక్క గెంతుతో చెట్టు కొమ్మపైకి ఉరికి ప్రాణాన్ని కాపాడుకుంది. ఈ దృశ్యాన్ని అక్కడున్న కోతులన్నీ చూశాయి. చేతికి చిక్కబోయిన కోతి తప్పించుకునే సరికి పులి నిరాశతో వెనుతిరిగింది. కొద్ది రోజులు గడచి పోయాయి. వేటకు బయలుదేరిన పులి కాలుకు సన్నని పదునైన గాజు పెంకు గుచ్చుకుంది. పులి ఎంత ప్రయత్నించినా గాజు పెంకు బయటకు రాలేదు సరికదా! మరింత లోతుకు వెళ్ళిపోయింది. అడవిలో వైద్య సేవలు అందిస్తున్న ఏనుగు కూడా ఎంతగానో ప్రయత్నించింది. పులి కాలుకు గుచ్చుకున్న గాజు పెంకును తీయలేక పోయింది. అడవిలోని ఏ జంతువూ గాజు పెంకును తీయలేదని, కోతులు మాత్రమే తమ చేతితో ఈ పెంకును చాకచక్యంగా తీయగలవని పులికి చెప్పింది ఏనుగు. కుంటుకుంటూ, కుంటుకుంటూ కోతులను వెతుకుతూ వెళ్లిన పులికి, చెట్టు పైనున్న కోతుల గుంపు కనబడింది. కోతులకు తన సమస్య చెప్పుకుని, తన కాలులో గుచ్చుకున్న గాజు పెంకును తీయమని కోతులను పులి అభ్యర్థించింది. పులి నైజం తెలిసిన కోతులు దాని అభ్యర్థనను పట్టించుకోలేదు. రోజులు గడిచే కొద్దీ, పులి కాలుకు చీము పట్టి, నడవలేని స్థితికి చేరుకుంది. దాంతో అది ఆహారాన్ని కూడా సంపాదించుకోలేకపోయింది. తాను కోతులను మోసం చేయడానికి ప్రయత్నించడం వల్లే, కోతులు తనకు సహాయం చేయడానికి ముందుకు రాలేదని తెలుసుకున్న పులి పశ్చాత్తాపంతో చింతించింది.

– పేట యుగంధర్
m : 9492571731



# కలంచెలిమి



**కొమ్ము పల్లవి**
9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల– దాట్ల, దంతాలపల్లి, మహబూబాబాద్.



**అప్పల ధనుష్**
7వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్ చిన్న మాదారం, కనగల్ మండలం, నల్లగొండ జిల్లా.



**పి. నందిని**
9వ తరగతి
టి.జి. మోడల్ స్కూల్, ముల్కనూరు, హన్మకొండ జిల్లా.



**జె. వర్షిత్**
7వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోమినాన్, ఖమ్మం.



**కందుల సహర్షిని**
9వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హవేళి ఘణపూర్, మెదక్ జిల్లా.



**టి.పల్లవి**
8వ తరగతి, ప్రాథమికోన్నత పాఠశాల, జీనుగురాల, మం. దేవరకద్ర, జిల్లా. మహబూబ్ నగర్.




# దేశం - కరెన్సీ

కరెన్సీ అనేది వ్యక్తులు, వ్యాపారాలు మరియు ప్రభుత్వాల మధ్య లావాదేవీలకు ఉపయోగించే మార్పిడి మాధ్యమం. ఇది నాణేలు మరియు బ్యాంకు నోట్లు వంటి భౌతిక రూపాల్లో లేదా డిజిటల్ ఫార్మాట్లలో ఉండవచ్చు. ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ISO) ప్రకారం, ప్రపంచంలో దాదాపు 180 కరెన్సీలు ఉన్నాయి, ప్రతి దేశానికి దాని స్వంత ప్రత్యేక కరెన్సీ ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా ఉపయోగించే కరెన్సీ యునైటెడ్ స్టేట్స్ డాలర్ (USD), తరువాత యూరో (EUR), జపనీస్ యెన్ (JPY), బ్రిటిష్ పౌండ్ (GBP) మరియు చైనీస్ యువాన్ (CNY) ఉన్నాయి.

| దేశం పేరు | కరెన్సీ |
|---|---|
| ఆఫ్ఘనిస్తాన్ | ఆఫ్ఘని |
| అల్బేనియా | లెక్ |
| అల్జీరియా | దినార్ |
| అండోరా | యూరో |
| అంగోలా | న్యూ క్వాంజా |
| ఆంటిగ్వా & బార్బుడా | తూర్పు కరేబియన్ డాలర్ |
| అర్జెంటీనా | పెసో |
| ఆర్మేనియా | డ్రామ్ |
| ఆస్ట్రేలియా | ఆస్ట్రేలియన్ డాలర్ |
| ఆస్ట్రియా | యూరో (గతంలో షిల్లింగ్) |
| అజర్బైజాన్ | మనాట్ |
| బహామాస్ | బహామియన్ డాలర్ |
| బహ్రెయిన్ | బహ్రెయిన్ దినార్ |
| బంగ్లాదేశ్ | టాకా |
| బార్బడోస్ | బార్బడోస్ డాలర్ |
| బెలారస్ | బెలారస్ రూబుల్ |
| బెల్జియం | యూరో (గతంలో బెల్జియన్ ఫ్రాంక్) |
| బెలిజ్ | బెలిజ్ డాలర్ |
| బెనిన్ | CFA ఫ్రాంక్ |
| భూటాన్ | గుల్ట్రమ్ |
| బొలీవియా | బొలీవియానో |
| బోస్నియా & హెర్జెగోవినా | కన్వర్టిబుల్ మార్క్ |
| బోట్స్వానా | పులా |
| బ్రెజిల్ | రియాల్ |
| బ్రూనై | బ్రూనై డాలర్ |
| బల్గేరియా | లెవ్ |
| బుర్కినా ఫాసో | CFA ఫ్రాంక్ |
| బురుండి | బురుండి ఫ్రాంక్ |
| కంబోడియా | రీల్జి |
| కామెరూన్ | CFA ఫ్రాంక్ |
| కెనడా | కెనడియన్ డాలర్ |
| కేప్ వెర్డే | కేప్ వెర్డియన్ ఎస్కుడో |
| సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ | CFA ఫ్రాంక్ |
| చాడ్ | CFA ఫ్రాంక్ |
| చిలీ | చిలియన్ పెసో |
| చైనా | చైనీస్ యువాన్ |
| కొలంబియా | కొలంబియన్ పెసో |
| కొమొరోస్ | ఫ్రాంక్ |
| కాంగో రిపబ్లిక్ | CFA ఫ్రాంక్ |
| కాంగో, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ ది | కాంగోలీస్ ఫ్రాంక్ |
| కోస్టా రికా | కోలన్ |
| కోట్ డి'ఐవోయిర్ | CFA ఫ్రాంక్ |
| క్రొయేషియా | క్రొయేషియన్ |
| క్యూబా | క్యూబన్ పెసో |
| సైప్రస్ | యూరో |
| చెక్ రిపబ్లిక్ | కొరునా |
| డెన్మార్క్ | డానిష్ క్రోన్ |
| జిబౌటి | జిబౌటియన్ ఫ్రాంక్ |
| డొమినికా | తూర్పు కరేబియన్ డాలర్ |
| డొమినికన్ రిపబ్లిక్ | డొమినికన్ పెసో |
| తూర్పు తైమూర్ (తైమూర్-లెస్టే) | అమెరికా డాలర్ |
| ఈక్వెడార్ | అమెరికా డాలర్ |
| ఈజిప్టు | ఈజిప్షియన్ పౌండ్ |
| ఎల్ సాల్వడార్ | కోలన్‌బీ యుఎస్ డాలర్ |
| ఈక్వటోరియల్ గినియా | CFA ఫ్రాంక్ |
| ఎరిట్రియా | నక్ఫా |
| ఎస్టోనియా | ఎస్టోనియా క్రూన్‌బీ యూరో |
| ఇథియోపియా | బిర్ |
| ఫిజీ | ఫిజీ డాలర్ |
| ఫిన్లాండ్ | యూరో (గతంలో మార్కా) |
| ఫ్రాన్స్ | యూరో (గతంలో ఫ్రెంచ్ ఫ్రాంక్) |
| గబాన్ | CFA ఫ్రాంక్ |
| గాంబియా | దలాసి |
| జార్జియా | లారీ |
| జర్మనీ | యూరో (గతంలో డ్యూయిష్ మార్క్) |
| ఘనా | సెడి |
| గ్రీస్ | యూరో (గతంలో డ్రాచ్మా) |
| గ్రెనడా | తూర్పు కరేబియన్ డాలర్ |
| గ్వాటెమాల | క్వెట్జల్ |

| | |
|---|---|
| గినియా | గినియన్ ఫ్రాంక్ |
| గినియా-బిస్సావు | CFA ఫ్రాంక్ |
| గయానా | గయానీస్ డాలర్ |
| హైతీ | గుమ్మడికాయ |
| హోండురాస్ | లెంపిరా |
| హంగేరీ | ఫోరింట్ |
| ఐస్లాండ్ | ఐస్లాండిక్ క్రోనా |
| భారతదేశం | భారత రూపాయి |
| ఇండోనేషియా | రూపాయి |
| ఇరాన్ | రియాల్ |
| ఇరాక్ | ఇరాకీ దినార్ |
| ఐర్లాండ్ | యూరో |
| | (గతంలో ఐరిష్ పౌండ్ ప్రంట్) |
| ఇజ్రాయెల్ | షెకెల్ |
| ఇటలీ | యూరో (గతంలో లిరా) |
| జమైకా | జమైకన్ డాలర్ |
| జపాన్ | యెన్ |
| జోర్డాన్ | జోర్డానియన్ దినార్ |
| కజకిస్తాన్ | టెంగే |
| కెన్యా | కెన్యా షిల్లింగ్ |
| కిరిబాటి | కిరిబాటి డాలర్ |
| కొరియా, ఉత్తరం | గెలిచింది |
| కొరియా, దక్షిణ | గెలిచింది |
| కొసావో | యూరో |
| | (2002కి ముందు జర్మన్ మార్క్) |
| కువైట్ | కువైట్ దినార్ |
| కిర్గిజ్స్తాన్ | సోమ్ |
| లావోస్ | కొత్త కిప్ |
| లాట్వియా | లాట్స్ |
| లెబనాన్ | లెబనీస్ పౌండ్ |
| లెసోతో | మలుటి |
| లైబీరియా | లైబీరియన్ డాలర్ |
| లిబియా | లిబియన్ దినార్ |
| లీచ్టెన్‌స్టెయిన్ | స్విస్ ఫ్రాంక్ |
| లిథువేనియా | లిటాస్ |
| లక్సెంబర్గ్ | యూరో |
| | (గతంలో లక్సెంబర్గ్ ఫ్రాంక్) |
| మాసిడోనియా | డెనార్ |
| మడగాస్కర్ | మలగాసీ అరియరీ |
| మలావి | క్వాచా |
| మలేషియా | రింగిట్ |
| మాల్దీవులు | రుఫియా |
| మాలి | CFA ఫ్రాంక్ |
| మాల్టా | యూరో |
| మార్షల్ దీవులు | యుఎస్ డాలర్ |
| మౌరిటానియా | ఔగుయా |
| మారిషస్ | మారిషస్ రూపాయి |
| మెక్సికో | మెక్సికన్ పెసో |
| మైక్రోనేషియా, | |
| సమాఖ్య రాష్ట్రాలు | యుఎస్ డాలర్ |
| మోల్డోవా | లెయు |
| మొనాకో | యూరో |
| మంగోలియా | టోగ్రోగ్ |
| మోంటెనెగ్రో | యూరో |
| మొరాకో | దిర్హం |
| మొజాంబిక్ | మెటికల్ |
| మయన్మార్ (బర్మా) | క్యాట్ |
| నమీబియా | నమీబియా డాలర్ |
| నౌరు | ఆస్ట్రేలియన్ డాలర్ |
| నేపాల్ | నేపాలీస్ రూపాయి |
| నెదర్లాండ్స్ | యూరో (గతంలో గిల్డర్) |
| న్యూజిలాండ్ | న్యూజిలాండ్ డాలర్ |
| నికరాగ్వా | బంగారు కార్డోబా |
| నైజర్ | CFA ఫ్రాంక్ |
| నైజీరియా | నైరా |
| నార్వే | నార్వేజియన్ క్రోన్ |
| ఒమన్ | ఒమాని రియాల్ |
| పాకిస్తాన్ | పాకిస్తానీ రూపాయి |
| పలావ్ | అమెరికా డాలర్ |
| పాలస్తీనా | పాలస్తీనా పౌండ్ |
| పనామా | బాల్బోవాబీ అమెరికా డాలర్ |
| పాపువా న్యూ గినియా | చైనా |
| పరాగ్వే | గ్వారాని |
| పెరూ | న్యూవో సోల్ (1991) |
| ఫిలిప్పీన్స్ | పెసో |
| పోలాండ్ | జ్లోటీ |
| పోర్చుగల్ | యూరో (గతంలో ఎస్కుడో) |
| ఖతార్ | ఖతారీ రియాల్ |
| రొమేనియా | రొమేనియన్ రూపాయి |
| రష్యా | రూబుల్ |
| రువాండా | రువాండన్ ఫ్రాంక్ |
| సెయింట్ కిట్స్ & నెవిస్ | తూర్పు కరేబియన్ డాలర్ |
| సెయింట్ లూసియా | తూర్పు కరేబియన్ డాలర్ |
| సెయింట్ విన్సెంట్ & | |
| గ్రెనడీన్స్ | తూర్పు కరేబియన్ డాలర్ |
| సమోవా | తాలా |
| శాన్ మారినో | యూరో |
| సావో టోమ్ & ప్రిన్సిపీ | దోబ్రా |
| సౌదీ అరేబియా | రియాల్ |
| సెనెగల్ | CFA ఫ్రాంక్ |
| సెర్బియా | సెర్బియన్ దినార్ |
| సీషెల్స్ | సీషెల్స్ రూపాయి |
| సియెర్రా లియోన్ | లియోన్ |
| సింగపూర్ | సింగపూర్ డాలర్ |
| స్లొవాకియా | యూరో |
| స్లోవేనియా | స్లోవేనియన్ టోలర్; |
| | యూరో (1/1/07 నాటికి) |
| సోలమన్ దీవులు | సోలమన్ దీవుల డాలర్ |
| సోమాలియా | సోమాలి షిల్లింగ్ |
| దక్షిణాఫ్రికా | రాండ్ |
| దక్షిణ సూడాన్ | సుడానీస్ పౌండ్ |
| స్పెయిన్ | యూరో (గతంలో పెసెటా) |
| శ్రీలంక | శ్రీలంక రూపాయి |
| సూడాన్ | సుడానీస్ పౌండ్ |
| సురినామ్ | సురినామీస్ డాలర్ |
| స్వాజిలాండ్ | లిలంగెని |
| స్వీడన్ | క్రోనా |
| స్విట్జర్లాండ్ | స్విస్ ఫ్రాంక్ |
| సిరియా | సిరియన్ పౌండ్ |
| తైవాన్ | తైవాన్ డాలర్ |
| తజికిస్తాన్ | సోమోని |
| టాంజానియా | టాంజానియన్ షిల్లింగ్ |
| థాయిలాండ్ | బాట్ |
| టోగో | CFA ఫ్రాంక్ |
| టోంగా | పా'అంగా |
| ట్రినిడాడ్ & టొబాగో | ట్రినిడాడ్ & టొబాగో డాలర్ |
| ట్యునీషియా | ట్యునీషియా దినార్ |
| టర్కీ | టర్కిష్ లిరా (YTL) |
| తుర్క్మెనిస్తాన్ | మనాట్ |
| తువాలు | టువాలువన్ డాలర్ |
| ఉగాండా | ఉగాండా న్యూ షిల్లింగ్ |
| ఉక్రెయిన్ | హ్రైవ్నియా |
| యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ | యుఎఇ దిర్హామ్ |
| యునైటెడ్ కింగ్‌డమ్ | పౌండ్ స్టెర్లింగ్ |
| అమెరికా | |
| సంయుక్త రాష్ట్రాలు | డాలర్ |
| ఉరుగ్వే | ఉరుగ్వే పెసో |
| ఉజ్బెకిస్తాన్ | ఉజ్బెకిస్తానీ మొత్తం |
| వనువాటు | వాటు |
| వాటికన్ నగరం | |
| (హోలీ సీ) | యూరో |
| వెనిజులా | బొలీవర్ |
| వియత్నాం | డాంగ్ |
| యెమెన్ | రియాల్ |
| జాంబియా | క్వాచా |
| జింబాబ్వే | యునైటెడ్ స్టేట్స్ డాలర్ |

– బాలచెలిమి డెస్క్

క
థ

# మారిన శీను



అనగనగా ఒక అడవి. ఆ అడవిలో ఒక మర్రిచెట్టు ఉండేది. దాని మీద ఒకవైపు రామ చిలుకల గుంపు మరోవైపు కాకుల గుంపు నివసిస్తూ ఉండేది. రోజూ రామ చిలుకలు మర్రి పండ్లు తింటూ ఉండేవి. కాకుల గుంపేమో బయటకు మేతకు వెళ్ళేది. ఆ అడవికి కొంచెం దూరంలో ఒక ఊరు ఉండేది. ఆ వూరిలో శీను అనే అల్లరి పిల్లవాడు ఉండేవాడు. అతని అల్లరితో ఆ ఊర్లో చాలా మంది బాధ పడ్డారు.ఇక చిన్న పిల్లలైతే అతడు పెట్టే అల్లరి బాధకు భరించలేక ఏడ్చే వాళ్ళు. ఇలా అందరినీ ఏదో ఒక రకంగా బాధ పెడుతూ ఎవరినీ లెక్క చేయకుండా తిరిగే వాడు.

ఈ విషయం తెలుసుకున్న శీను వాళ్ళ అమ్మ "ఇలాంటి చెడ్డ పనులు మరోసారి చేస్తావా? అంటూ బాగా తిట్టింది. శీనుకు బాధేసింది.కొద్ది రోజులు అల్లరి మానేశాడు.

మళ్ళీ కొద్ది రోజుల తర్వాత అలాగే అల్లరి చేస్తూ వుంటే వాళ్ళ అమ్మ చూసి బాగా తిట్టింది.అమ్మ తిట్టిందనే కోపంతో బయటకు వెళ్ళాడు. అలా వెళుతూ వెళుతూ అడవికి దగ్గరకు వచ్చేశాడు. అక్కడ మర్రిచెట్టు కనిపించింది. ఆ చెట్టు దగ్గరకు వెళ్ళాడు. ఆ చెట్టు మీద కూర్చుని ఉన్న రామచిలుకల గుంపును చూశాడు. వాటిని ఎలాగైనా చంపాలని అనుకున్నాడు. పక్కనే ఉన్న ఒక రాయి తీసుకుని వాటి మీదకు విసిరాడు. ఆ రాయి గుంపు లోని ఒక చిలుకకు తాకి కిందపడి చనిపోయింది. ఆ తర్వాత శీను ఇంటికి వచ్చేశాడు.

సాయంత్రం వేళ కాగానే తిరిగి వచ్చిన కాకుల గుంపు దగ్గరకు వెళ్ళి శీను విషయం చెప్పాయి.

అప్పుడు కాకుల గుంపు చిలుక మరణానికి బాధ పడుతూ ఆ పిల్లవాడికి ఎలాగైనా బుద్ధి చెబుతామని ధైర్యం చెప్పాయి.

మరుసటి రోజు కాకుల గుంపు మేతకు వెళ్ళకుండా శీను కోసం ఎదురుచూస్తూ ఉన్నాయి.

ఎప్పటి లాగానే తన అల్లరికి అమ్మ తిడితే బయటకు వచ్చి చెట్టు దగ్గరకు వెళ్ళి రాళ్ళు తీసుకుని చిలుకల గుంపు మీద వేయబోయాడు. చెట్టు కొమ్మల్లో దాక్కున్న కాకులన్నీ గుంపుగా వచ్చి శీనును పొడవడం మొదలు పెట్టాయి. శీను అవి పెట్టిన బాధకు భరించలేక "అమ్మో! అయ్యో! అని అరుస్తూ అటూ ఇటూ ఉరికాడు.

అప్పుడు ఓ రామచిలుక వచ్చి శీనుతో "నీ అల్లరి పని వల్ల మా చిలుకల గుంపులో ఒక రామ చిలుక చనిపోయింది. నీవు రాళ్ళతో కొట్టిన దెబ్బకు బాధ పడుతూ గిలగిలా కొట్టుకుని చనిపోయింది. ఇప్పుడు నీకు బాధ అంటే ఏమిటో తెలిసిందా? అంది.

ఆ మాటలు విన్న శీనుకు తాను చేసిన తప్పు తెలిసింది. "నన్ను క్షమించండి.నేను చాలా పెద్ద తప్పు చేశాను.ఇక ఇప్పటి నుండి ఎవ్వరినీ బాధ పెట్టను.ఎప్పుడూ అల్లరి చేయను." అన్నాడు. అప్పుడు కాకులు "ఇకనుంచి మంచిగా ఉండు! ఎవరినీ బాధ పెట్టకు. పెట్టావని తెలిస్తే ఈసారి మేమంతా కలిసి నీ కళ్ళలో పొడుస్తాం" అని గట్టిగా బెదిరించాయి. అప్పటి నుంచి శీను అల్లరి పూర్తిగా మానేశాడు.మంచి పిల్లవాడిగా మారిపోయాడు. శీనులో వచ్చిన మార్పు చూసి వాళ్ళ అమ్మ, ఊరిలో అందరూ చాలా సంతోషించారు.

– గార్లపాటి క్రిష్ణ మనోహర్
8వ తరగతి, పాప కొల్లు
m : 9441815722

# ఆవు

ఆవు – మన జీవితంలో అపారమైన ప్రాముఖ్యత కలిగిన జంతువు. ఆవు మనకు అత్యంత ఉపయోగకరమైన పెంపుడు జంతువు. ఇది గ్రామాల్లో, పట్టణాల్లో చురుకుగా కనిపిస్తుంది. ఆవు శాంతియుతంగా గడ్డి తింటూ నెమ్మదిగా నడుస్తుంది. మనం రోజూ తాగే పాలు ఎక్కువగా ఆవు నుండే వస్తాయి. అందుకే దానిని "గోమాత" అని గౌరవంగా పిలుస్తాం. పురాణకాలం నుంచీ హిందువులు ఆవును పవిత్రంగా భావించి, దానికి విశేష గౌరవం అందించారు. పండుగలలో, దేవాలయాల్లో ఆవును పూజించడం ఒక మంచి సంప్రదాయం. భారతదేశంలో ఆవును చంపకూడదనే నిబంధనలు కూడా ఉన్నాయి. ఆవు నుండి వచ్చే పాలు ఆరోగ్యానికి ఎంతో మేలవుతాయి. పాలతో నెయ్యి, పెరుగు, జున్ను, పన్నీర్, మజ్జిగ వంటి అనేక పదార్థాలు తయారవుతాయి. పిల్లల శారీరక, మేధో వృద్ధికి ఆవు పాలు ఎంతో సహాయకరంగా ఉంటాయి. ఆవు పేడను ఎరువుగా, ఇంధనంగా, ఇంటి గోడలను చల్లగా ఉంచడానికి ఉపయోగిస్తారు. ఆవు మూత్రం కూడా కొన్ని ఔషధ గుణాలు కలిగి ఉంటుంది. మన దేశంలో ఎన్నో రకాల ఆవుల జాతులు ఉన్నాయి. వాటిలో ఒంగోలు జాతి ప్రపంచ ప్రసిద్ధి పొందింది. ఇది బలమైన, అందమైన జాతిగా వ్యవసాయానికి కీలక భాగస్వామి. ఆవులు సామూహికంగా ఉండటం ఇష్టపడతాయి. ఇవి మనపై శ్రద్ధ చూపిస్తాయి, వాసనను బాగా గుర్తిస్తాయి. ఈ జంతువులు మెట్లు ఎక్కగలిగినా దిగలేవు. ఇవి ఈత కూడా చేయగలవు.



### గోమాత – భారతీయ సంస్కృతిలో పవిత్రత

భారతీయ సంస్కృతిలో గోమాతకు ఆధ్యాత్మిక ప్రాధాన్యం చాలా ఉంది. గోవు అనేది దేవతల నివాసస్థలంగా భావిస్తారు. వేదాలు గోవులో అనేక దేవతలు నివసిస్తాయని చెబుతాయి. గోమాతను పూజించడం ద్వారా పాపాలు శుభ్రమవుతాయని, పవిత్రత వస్తుందని విశ్వాసం ఉంది.

### ఆవు యొక్క ఆర్థిక, ఔషధ విలువలు

ఆవు నుండి లభించే పాలు, పెరుగు, నెయ్యి, పేడ, మూత్రం "గోపంచక"గా పిలవబడతాయి. ఇవి ఆయుర్వేదంలో ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. గోమూత్రం ఆధారంగా తయారైన ఔషధాలు క్యాన్సర్ నిరోధక గుణాలు కలిగినట్లు పరిశోధనలు చూపిస్తున్నాయి. పేడతో గోబర్ గ్యాస్, వంట ఇంధనాలు తయారవుతాయి. పేడను ఇంటి గోడలపై పూసి చల్లగా ఉంచుతారు. పేడకు అంతర్జాతీయ గుర్తింపు కూడా ఉంది.

### వ్యవసాయంలో గోవుల పాత్ర

రైతు జీవితం గోమాత లేకపోతే అసాధ్యం. పాలు ఇచ్చే ఆవులు, పొలం దున్నే ఎద్దులు వ్యవసాయానికి అవసరం. ఎద్దులు భూములను దున్నడం, సరుకులు రవాణా చేయడం వంటి పనుల్లో సహాయం చేస్తాయి.

### దేశవాళీ గో జాతులు

భారతదేశంలో అనేక దేశవాళీ గో జాతులు ఉన్నాయి: **ఒంగోలు (ఆంధ్రప్రదేశ్)** – ప్రపంచ ప్రఖ్యాతి పొందిన జాతి. **గిర్ (గుజరాత్)** – ఎక్కువ పాలు ఇస్తుంది. **పుంగనూరు** – చిన్నతనానికి ప్రసిద్ధి. **కపిల, షాహియత్, దయోని** వంటి ఇతర ప్రత్యేక జాతులు ప్రస్తుతం వాణిజ్య అవసరాలకు సంకర జాతులు, జెర్సీ ఆవులు పెరుగుతున్నా, ఔషధ, ఆధ్యాత్మిక ప్రయోజనాల కోసం దేశవాళీ గో జాతులకు ప్రాధాన్యం ఉంది.

### గోరక్షణ అవసరం

గోవుల ప్రాముఖ్యతను గుర్తించి, దేశవ్యాప్తంగా గోరక్షణ చట్టాలు, ఉద్యమాలు జరుగుతున్నాయి. పాఠశాలల్లో గోపూజ, గో ఉత్సవాలు నిర్వహించి ప్రజల్లో గో పట్ల ప్రేమను పెంపొందిస్తున్నారు.

### ముగింపు

గోమాత కేవలం పూజార్హ జంతువు మాత్రమే కాదు, భారతీయ సంస్కృతి, జీవన విధానంలో ముఖ్యమైన జీవి. దాన్ని రక్షించడం, గౌరవించడం మన అందరి బాధ్యత. గోమాత పట్ల ప్రేమ, సేవ భావం కలిగి ఉంటే మన సంస్కృతిని నిలబెట్టుకోవచ్చు.

ధర్మో రక్షతి రక్షితః – గోమాతను రక్షించడం ద్వారా మన ధర్మాన్ని రక్షిస్తున్నాం. గోమాత శరణం మమ?

– సచిన్ కోత్వాల్

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ హైదరాబాద్ (Regd. 720/1982)

బాలచెలిమి గ్రంథాలయం

## జెడ్.పి.హెచ్.ఎస్., చిన్న మాదారం, కనగల్లు, నల్లగొండ

# చిన్న మాదారం బడిలో బాల చెలిమి ముచ్చట్లు





పుస్తకం సమస్త ప్రపంచం అని మా సార్లు రోజూ చెబుతుంటారు. కేవలం పాఠ్యపుస్తకాలే కాకుండా ఇతర పుస్తకాలు కూడా చదివితే విజ్ఞానం మరింత సొంతమవుతుందని, సమాజంలో ఎట్లా నడుచుకోవాలో కూడా తెలుస్తుందని మా గురువులు నిత్యం వల్లె వేస్తున్నారు. అందుకే మాకు గ్రంథాలయ పుస్తకాల మీద ప్రేమ మళ్లింది. మాది నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని చిన్న మాదారం ఉన్నత పాఠశాల. ప్రతి నెల బడికి బాల చెలిమి పత్రిక వస్తుంది. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలతో పాటు బాల చెలిమి ఇష్టంగా చదువుతాం. ఇది మమ్ముల ఎక్కువగా ఆకర్షిస్తుంది. ఎందుకంటే అందులో బోలెడన్ని కథలు వస్తున్నాయి. బొమ్మలు వివిధ రంగులలో ఉంటున్నాయి. గేయాలు, పర్యావరణం, పండుగలు, అనువాద కథలు, సైన్స్ కథలు, సైంటిస్టులు, ఆటలు, యాత్రలు, కార్టూన్ బొమ్మలు, పద్యాలు మొదలైన విషయాలను ప్రతి నెలా మేం ఆసక్తిగా చదువుతున్నాం. బుచ్చిరెడ్డి సార్ మా పాఠశాలకు వచ్చిన తర్వాత పాఠ్యపుస్తకాలే కాకుండా బాల చెలిమి వంటి కథల పుస్తకాలు అందుబాటులో తెచ్చి చదివేలా చేస్తున్నారు. ఆయన కథలు కూడా గమ్మత్తుగా చెబుతారు. మా హెచ్ఎం పద్మ మేడంతో పాటు ఉపాధ్యాయులు అందరూ బాగా చదవండి అని ప్రోత్సహిస్తున్నారు. ఇక నుండి మేమంతా కలిసి ఏడాది చందా చెల్లించి బాల చెలిమి పుస్తకాన్ని ప్రతి నెల తెప్పించుకుంటాం. అందరి ప్రేరణతో త్వరలో మేము రాసిన కథలు పుస్తక రూపం దాల్చనుంది. మా అభ్యసనానికి దాపుగా నిలిచిన బాల చెలిమికి, సంపాదకులు వేద కుమార్ సార్‌కు మనసు నిండా కృతజ్ఞతలు తెలియజేస్తున్నం. ఈ పత్రికను ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నం.

– చిన్న మాదారం బడి పిల్లలం

## పిల్లల్ని ఆకర్షిస్తుంది

మా పాఠశాలలో గ్రంథాలయం పీరియడ్లో విద్యార్థులు చాలా చక్కగా బాల చెలిమిని శ్రద్ధగా చదువుచున్నారు. అందులో వచ్చే కథలు, గేయాలు, సైంటిస్టులు, చెట్టు-చేమ, పండుగలు, గేయాలు తదితర విషయాల గురించి చాలా చక్కగా బొమ్మలతో ఆకర్షణీయంగా ఉండడం వల్ల విద్యార్థులు ఇష్టంగా చదువు చున్నారు. పిల్లలు కథలు రాయడం కూడా ప్రయత్నిస్తున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను బాగా ప్రోత్సహిస్తున్నారు. పిల్లల కొరకు ప్రత్యేకంగా ప్రచురిస్తున్న బాల చెలిమి నిర్వాహకులు, యజమాన్యానికి ధన్యవాదాలు. చందా చెల్లించి మా పాఠశాలకు రెగ్యులర్‌గా తెప్పిస్తాను.

– వల్లపట్ల పద్మ
గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు
ZPHS, చిన్న మాదారం, మం. కనగల్లు

## విద్యార్థులు సాహిత్యాభిరుచిని పెంపొందించుకోవాలి



అనుబంధాలు పుస్తకావిష్కరణ సభలో ఎస్.ఐ. శీలం లక్ష్మణ్... పెద్దపల్లి జిల్లా నర్సింహుల పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మల్లె వెంకట సుప్రజ రాసిన "అనుబంధాలు" కవితా పుస్తకాన్ని ధర్మారం ఎస్.ఐ. శీలం లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుండే విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌళిక వసతులు ఉన్నాయని, ఉత్తమ బోధన చేసే అనుభవం గల ఉపాధ్యాయులు ఉన్నారని కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలనున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్ ప్రోత్సాహంతో సుప్రజ రాసిన పుస్తకం బాగుందని, ఇంత చిన్న వయసులోనే అద్భుతమైన కవిత్వం రాసిందని, విద్యార్థులు సాహిత్యాభిరుచిని పెంచుకొని బాల సాహిత్యం చదవడం ద్వారా మంచి లక్షణాలు అలవడుతాయని అన్నారు. సుప్రజను స్ఫూర్తిగా తీసుకుని మిగతా విద్యార్థులు కూడా చదువుతోపాటు తమకు ఇష్టమైన ఇతర రంగంలో కూడా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల రవీందర్ అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని కవి, రచయిత అడిచర్ల సతీష్ కుమార్ పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, రమేష్, ఆంజనేయులు, పుష్పలత, శ్రీనివాస చక్రవర్తి, కందుకూరి భాస్కర్, రాం చంద్రారెడ్డి మరియు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాలసాహిత్య రాష్ట్ర స్థాయి పురస్కారం కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి అందజేత

తేది : 10-06-2025 మంగళవారం హైదరాబాదు లోని రవీంద్ర భారతిలో జరిగిన వసుంధర విజ్ఞాన వికాస మండలి 32వ వార్షికోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తెలంగాణ శాసనమండలి చైర్మన్ వ్యక్తిగత కార్యదర్శి, ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు ఏనుగు నరసింహారెడ్డి, కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా బాలసాహిత్య రంగంలో రాష్ట్రస్థాయి స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. బుచ్చిరెడ్డి నల్గొండ జిల్లా కనగల్లు మండలంలోని చిన్నమాదారం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆయన గతంలో పిల్లల కోసం 'మొలకలు', 'బహుమతి', 'బంతిపూలు' వంటి పిల్లల కథలతో పాటు "ఊగుతున్న ఉయ్యాల" బాల గేయాల సంపుటి రాశారు.

## మాచిరాజు సీతారామయ్య, రత్నకుమారి దంపతుల స్మారక బాల సాహిత్య పురస్కారం 2025

మాచిరాజు బాల సాహిత్య పీఠం ప్రతి సంవత్సరం ఇద్దరు బాల సాహితీవేత్తలను మాచిరాజు సీతారామయ్య, రత్నకుమారి దంపతుల స్మారక బాల సాహిత్య పురస్కారంతో సత్కరిస్తున్న విషయం మీకు తెలుసు. 2023లో ఈ పురస్కారం శ్రీయుతులు వసుంధర దంపతులకు మరియు శ్రీ దాసరి వెంకట రమణ గారికి 2024లో శ్రీ చొక్కాపు వెంకట రమణ గారికి మరియు శ్రీ పత్తిపాక మోహన్ గారికి ప్రదానం చేయడం జరిగింది. ఈ సంవత్సరం ఈ పురస్కారానికి బాల సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన బాల సాహితీవేత్తలు శ్రీ బూర్లె నాగేశ్వరరావు మరియు శ్రీమతి ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి గార్లను ఎంపిక చేయడం జరిగింది. వారికి మాచిరాజు బాల సాహిత్య పీఠం తరఫున అభినందనలు. 03.08.2025న ఉదయం 10 గంటలకు సమావేశ మందిరం, రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరిగే మాచిరాజు బాల సాహిత్య పీఠం వారి సభలో పురస్కార ప్రదానం వుంటుంది. అదే సభలో మాచిరాజు సీతారామయ్య, రత్నకుమారి దంపతుల స్మారక బడి పిల్లల కథల పోటీ 2025లో విజేతలైన 38 మంది విద్యార్థులకు బహుమతి ప్రదానం చేయబడుతుంది. బాల సాహితీవేత్తలు అందరూ ఈ సభలో పాల్గొని సభను విజయవంతం చేయ ప్రార్థన. ఆహ్వాన పత్రిక త్వరలోనే అందజేయడం జరుగుతుంది!

**మాచిరాజు కామేశ్వరరావు**
అధ్యక్షులు, మాచిరాజు బాలసాహిత్య పీఠం, సికింద్రాబాదు.

## 'పాఠశాల పరిమళాలు'లో బాలల ఆలోచనల ఆవిష్కరణ

### విద్యార్థుల సృజనాత్మకతకు పత్రికలు దోహదం చేస్తాయి.




విద్యార్థులలో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి పత్రికలు దోహదం చేస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చేర్యాల ప్రాంత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల రచనలతో కూడిన మాస పత్రిక 'పాఠశాల పరిమళాలు' ను ఆయన ఆవిష్కరించారు. చేర్యాల ప్రాంతం నుండి పిల్లల పత్రిక రావడం అభినందనీయమని, కృషి చేసిన మండల విద్యాధికారి రచ్చ కిష్టయ్యను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ పత్రికలో పిల్లలకు ఉపయుక్తమైన విషయాలున్నాయని జిల్లా అకడమిక్ మానీటరింగ్ అధికారి భేతి భాస్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ, నరిగె బాలభాస్కర్, రాకేశ్ రెడ్డి, ఆకుల వేణు పాల్గొన్నారు.


## "యంగ్ మైండ్స్ టైమ్ లెస్ టేల్స్" పుస్తకావిష్కరణ

ఆసిఫాబాద్, జూలై 11: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ZPSS జనకాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆంగ్ల భాషలో రచించిన కథల సంకలనం "Young Minds Timeless Tales" పుస్తకాన్ని కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి హర్ష మల్హోత్రా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "24 మంది విద్యార్థులు స్వీయ ఆలోచనల ఆధారంగా ఆంగ్లంలో కథలు రచించడం ప్రశంసనీయం. ఈ సృజనాత్మకతకు మార్గదర్శకుడు ఆంగ్ల ఉపాధ్యాయుడు ధర్మపురి వెంకటేశ్వర్లు నిస్వార్థంగా చేసిన కృషి వల్లే ఈ రోజు ఈ ఘనత సాధ్యమైంది. భవిష్యత్తులో విద్యార్థులు గొప్ప రచయితలుగా ఎదగాలని ఆశిస్తున్నాను, అని పేర్కొన్నారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్ వెంకటేష్, అదనపు కలెక్టర్ దీపక్ శ్రీవారి, జిల్లా కవులు, రచయితలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


– బాలచెలిమి డెస్క్

## పుస్తక పరిచయం


### పుస్తక పరిచయం




**అనంతసాగర అక్షర కెరటాలు**
**బైతి దుర్గయ్య**
జెడ్‌పిహెచ్,
అనంతసాగర్.
m : 9959007914




**విశ్వతేజం**
**(బాలల కథలు)**
**బైతి దుర్గయ్య**
జెడ్‌పిహెచ్,
అనంతసాగర్.
m : 9959007914





**పిల్లలకో బహుమతి**
**(కథల సంపుటి)**
సంపాదకులు:
**ఏడుకొండలు కళ్ళేపల్లి**
మచిలీపట్నం, ఆం.ప్ర.
m : 9490832338


**మామిడిపండ్ల గంప**
**(బందనకల్ బడిపిల్లల కథలు)**
**రాజ్‌కుమార్**
బందనకల్, ముస్తాబాద్,
రాజన్న సిరిసిల్లా.
m : 94416 72710




**యంగ్ మైండ్స్ టైమ్ లెస్ టేల్స్**
**ధర్మపురి వెంకటేశ్వర్లు**
జనక్‌పూర్,
ఆసిఫాబాద్
m : 98666 45822





**అనుబంధాలు**
**(కవిత్వం)**
రచన :
**మల్లె వెంకట సుప్రజ**
m : 97034 87088



# దేశసేవకు అంకితమైన ఉద్యమాల ఊపిరి - కొండా లక్ష్మణ్ బాపూజీ

కొండా లక్ష్మణ్ బాపూజీ – దేశస్వాతంత్ర్యం, న్యాయం, ప్రజాస్వామ్యం, ప్రత్యేక తెలంగాణ కోసం తన జీవితాన్ని అంకితంగా వెచ్చించిన మహోన్నత నాయకుడు. ఆయన జననం 1915 సెప్టెంబరు 27న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వాంకిడి గ్రామంలో పద్మశాలి కుటుంబంలో జరిగింది. చిన్ననాటి నుంచే ఆయనలో దేశభక్తి అలవడింది. 1941లో మహాత్మా గాంధీని కలసిన ఆయన, ఆ మహాత్ముడి భావజాలం నుంచి ప్రేరణ పొందారు. ఆ ప్రేరణతోనే 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఇది ఆయన జీవితంలో మొదటి పెద్ద ఉద్యమం.



## నిజాం పాలనకు వ్యతిరేక పోరాటం

తెలంగాణ విముక్తి పోరాటంలో చురుకుగా పాల్గొన్నారు. 1947లో నిజాం నవాబుపై జరిగిన బాంబు దాడిలో ఆయనపై ఆరోపణలు రావడంతో, మద్రాసు నగరానికి పారిపోవాల్సి వచ్చింది. 1948లో హైదరాబాద్ విముక్తి అనంతరం ఆయన విశాలాంధ్రను తీవ్రంగా వ్యతిరేకించారు.

## రాజకీయ సేవా ప్రస్థానం

బాపూజీ తన రాజకీయ జీవితాన్ని 1952లో ప్రారంభించారు. అప్పట్లో ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం 1967, 1972లో భువనగిరి నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 1957-60 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. దామోదరం సంజీవయ్య, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గాల్లో పలు శాఖలకు మంత్రిగా సేవలందించారు – ముఖ్యంగా ఎక్సైజ్, చేనేత, కార్మిక, సమాచార శాఖలు. పీవీ నరసింహారావుతో ముఖ్యమంత్రి పదవికి పోటీపడ్డ బాపూజీకి ఆ పదవి రాకపోయినా, ఇందిరా గాంధీ గవర్నర్ పదవిని ఆఫర్ చేసినప్పుడు, ఆయన సున్నితంగా తిరస్కరించారు. పదవికంటే ప్రజల సంక్షేమాన్ని మిన్నగా చూసిన గొప్పతనం బాపూజీది.

## 1969 తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర

1969లో తెలంగాణ ఉద్యమం మొదలైన సమయంలో, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల కోరిక మేరకు ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇది అప్పట్లో సంచలనంగా మారింది. కేంద్రానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడిన మర్రి చెన్నారెడ్డితో ఆయన భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు.

## టీఆర్ఎస్ ఆవిర్భావానికి బాపూజీ సహకారం

2000లో కేసీఆర్ ప్రారంభించిన మలిదశ తెలంగాణ ఉద్యమానికి బాపూజీ పూర్తి మద్దతు అందించారు. ఆయన తన నివాసం 'జలదృశ్యం'ను టీఆర్ఎస్ మొదటి కార్యాలయంగా ఉపయోగించేందుకు ఇచ్చారు.

## నిరంతర ఉద్యమంలో పాల్గొన్న నాయకుడు

తెలంగాణ కోసం ఆయన ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నారు. ఇందిరా పార్కులో సత్యాగ్రహ దీక్షలు, ఢిల్లీలో చలిని లెక్క చేయకుండా జంతర్ మంతర్ వద్ద సత్యాగ్రహం నిర్వహించడం ఆయన త్యాగ స్వరూపాన్ని ప్రతిబింబిస్తుంది. (అంతేకాక, సమైక్యవాదు లనూ చర్చలకు ఆహ్వానించి, తెలంగాణకు న్యాయం చేయాలని కేంద్రాన్ని కోరారు. ప్రత్యేక రాష్ట్రం ఇవ్వకపోతే సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.)

## సేవా కార్యక్రమాలు & మరణం

స్వగ్రామం వాంకిడిలో లక్ష్మణ్ సేవాసదన్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి, అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. 2012 సెప్టెంబరు 21న, 97 ఏళ్ల వయసులో ఆయన పరమపదించగా, అది తెలంగాణ ఉద్యమానికి తీరని లోటుగా నిలిచింది. 2014లో తెలంగాణ ప్రభుత్వం ఆయన గౌరవార్థం ఉద్యానవన విశ్వవిద్యాలయానికి "శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయం" అనే పేరు పెట్టింది. ఆయన జన్మదినాన్ని ప్రభుత్వం అధికారికంగా జరుపుకుంటోంది.

– సువేగా

Oxford Grammar High School

KNOWLEDGE IS POWER

OGS JUNIORS grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



# We make school time the best time for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186, Behind SBH(H.O)
Gunfoundry, Hyd-1.
Ph: 66468646, 23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET




- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com